Nityam Nigha 05.09.26_Layout 1 9/5/2026 6:14 AM Page 1

RNI. TGTEL/25/A1665

నిత్యం నిఘా

తెలుగు దినపత్రిక

బూర నగేష్ గౌడ్
ఎడిటర్

మండలాలవారీగా
విలేకరులు కావలెను
సీనియర్లకు ప్రాధాన్యత
ఐడి కార్డు, ట్యాగ్, లోగో, వెహికల్ స్టిక్కర్స్ ఇవ్వబడును
ఆసక్తి, అనుభవం కలిగిన వారు సంప్రదించగలరు
94419 74025
మూసివేయలేని కన్ను - నిత్యం నిఘా

www.nityamnigha.com

RNI. TGTEL/25/A1665

నిత్యం నిఘా

తెలుగు దినపత్రిక

NITYAM NIGHA TELUGU DAILY

మూసివేయలేని కన్ను - నిత్యం నిఘా

Published From : Warangal

Circulated at : Telangana All Districts



వరంగల్ | సంపుటి 2 | సంచిక 64 | ఎడిటర్ - బూర నగేష్ గౌడ్ | శనివారం 05.09.2026 | పేజీలు : 8 | వెల : 4/-

నాణ్యతా ప్రమాణాలతో ఎడ్యుకేషన్ హబ్ పనులు పూర్తి చేయాలి

- సీఎం రేవంత్ కీలక ఆదేశాలు

- వికారాబాద్ జిల్లా హకీంపేట్‌లో పలు విద్యాసంస్థల నిర్మాణ పనులను పరిశీలించిన సీఎం రేవంత్ రెడ్డి.ప్రభుత్వ వైద్య, ఇంజనీరింగ్ కాలేజీలు, 400 పడకల ఆసుపత్రి భవనాల పురోగతిపై క్షేత్రస్థాయి సమీక్ష.
- నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని అధికారులకు ఆదేశం.



నిత్యం నిఘా, వికారాబాద్ : రాష్ట్రంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హకీంపేట్ ఎడ్యుకేషన్ హబ్ పనుల పురోగతిని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పరిశీలించారు. వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం హకీంపేట్ చేరుకున్న ముఖ్యమంత్రి, వివిధ విద్యా సంస్థల భవన సముదాయాల నిర్మాణాలను క్షేత్రస్థాయిలో ఒక్కొక్కటిగా పరిశీలిస్తూ అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ ఎడ్యుకేషన్ హబ్‌లో భాగంగా ఏర్పాటు చేస్తున్న ప్రభుత్వ వైద్య, వెటర్నరీ, నర్సింగ్, ఫిజియోథెరపీ, పారామెడికల్, ఇంజనీరింగ్ కాలేజీలు, 400 పడకల ఆసుపత్రితో పాటు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ భవనాలు, హాస్టళ్ల భవన సముదాయాలను ఆయన పరిశీలించారు. ఇక్కడ జరిగే అన్ని నిర్మాణాల విషయంలో విభాగాలు సమన్వయంతో పనిచేయాలని సూచిస్తూ, నాణ్యత మరియు ఇతర సాంకేతిక అంశాల్లో నిరంతరం పర్యవేక్షణ ఉండాలని అధికారులను ఆదేశించారు. అంతేకాకుండా వర్షాల సమయంలో నీరు నిలవకుండా వాటర్ హార్వెస్టింగ్ వెల్స్‌ను ఏర్పాటు చేయాలని, వర్షపు నీటిని ఒడిసిపట్టి ల్యాండ్‌స్కేపింగ్ పనులకు వినియోగించు కునేలా పక్కా ప్రణాళికలు రూపొందించాలని సూచించిన అనంతరం, నియోజకవర్గ అభివృద్ధి పనులపై ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు.

ట్రంప్ దృష్టిలో మోదీ అగ్రస్థానంలో ఉంటారు..

అమెరికా రాయబారి ఆసక్తికర వ్యాఖ్యలు!



- మోదీని కలవడానికి ట్రంప్ ఆసక్తిగా ఉన్నారన్న సెర్గియో గోర్
- డిసెంబర్‌లో జీ20 సదస్సు కోసం అమెరికా పర్యటనకు మోదీ
- భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం త్వరలో ఖరారయ్యే సూచనలు 2
- 500 బిలియన్ డాలర్ల వాణిజ్య లక్ష్యం
- భారత్ విశ్వసనీయ రక్షణ భాగస్వామి అన్న గోర్

ఆ పోస్టులతో మాకు సంబంధం లేదు

- కొండా సురేఖ స్పష్టీకరణ



- తన పేరుతో సర్కులేట్ అవుతున్న పోస్టులను ఖండించిన కొండా సురేఖ
- క్రమశిక్షణ చర్యల కింద కేబినెట్ నుంచి సురేఖకు ఉద్వాసన
- కుమార్తె వ్యాఖ్యలపై ఇచ్చిన షోకాజ్ నోటీసుతో మొదలైన వివాదం
- అధిష్ఠానాన్ని బ్లాక్ మెయిల్ చేసి తనను తొలగించారని రేవంత్ రెడ్డిపై ఆరోపణ 2
- కాంగ్రెస్ పార్టీని వీడేది లేదని స్పష్టం చేసిన మాజీ మంత్రి

కొండా సురేఖను తొలగించారు..

పొంగులేటి సంగతి ఏమిటి?

- హరీశ్ రావు



- రేవంత్ ను వ్యక్తిగతంగా విమర్శించారనే కొండా సురేఖపై వేటు వేశారన్న హరీశ్
- 22ఏ పేరుతో రైతులను పీడిస్తున్న పొంగులేటిపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్న 2
- భూముల చుట్టూనే రేవంత్ రెడ్డి తిరుగుతున్నాడని మండిపాటు

సర్టిఫికెట్లు లేకున్నా అప్లై చేసుకోవచ్చు..

- తెలంగాణలో కొత్త పింఛన్ దరఖాస్తుదారులకు ఉపశమనం



- ఆన్‌లైన్, మీసేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకునే అవకాశం
- వెరిఫికేషన్ సమయంలో మాత్రం సర్టిఫికెట్లు తప్పనిసరి
- సర్టిఫికెట్ల జాప్యంతో అర్హులకు ఇబ్బందులు
- దివ్యాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలకు ఊరట
- కొత్త పింఛన్లకు సెప్టెంబర్ 15 చివరి తేదీ

నిత్యం నిఘా, హైదరాబాద్ : కొత్త పింఛన్ కోసం ఎదురుచూస్తున్న అర్హులకు తెలంగాణ ప్రభుత్వం ఊరటని చ్చింది. దరఖాస్తు సమయంలో ధ్రువీకరణ పత్రాలు అందుబాటులో లేకపోయినా.. వాటి కోసం ఎదురుచూడాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. ముందుగా కొత్త పింఛన్‌కు దరఖాస్తు చేసుకోవచ్చని రాష్ట్ర ప్రభుత్వం, సెర్ప్ వెల్లడించింది. దీంతో సర్టిఫి కెట్లు రావడంలో జాప్యం కారణంగా దరఖాస్తు గడువు మిస్ అవుతుందేమోనని ఆందోళన చెందుతున్న వారికి ఉపశమనం లభించింది. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో కొత్త పింఛన్ల కోసం దరఖాస్తుల ప్రక్రియ కొనసాగుతోంది. అయితే దివ్యాంగుల సర్టిఫికెట్లు, కులం, ఆదాయం, మరణ ధ్రువీ కరణ పత్రాలు పొందడంలో ఆలస్యం జరు గుతున్నట్లు ప్రభుత్వానికి ఫిర్యాదులు అందా యి. రెవెన్యూ, తహసీల్దార్ కార్యాలయాలు, సదరం క్యాంపుల నుంచి సర్టిఫికెట్లు పొందేందుకు సమయం పడు తుండటంతో అర్హులు ఇబ్బం దులు ఎదుర్కొంటున్నారు.... 2

సన్నబియ్యాన్ని విక్రయిస్తే రేషన్ కార్డులు రద్దు - మంత్రి తుమ్మల



- ప్రభుత్వం ఇచ్చిన సన్నబియ్యాన్ని విక్రయిస్తే రేషన్ కార్డులు రద్దు చేస్తామని హెచ్చరిక
- అర్హులైన పేదలకు ఇళ్లు ఇవ్వని సర్పంచుల పదవులు ప్రమాదంలో పడతాయని స్పష్టీకరణ
- పోడు భూముల సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని హామీ 2

కాంగ్రెస్‌లో అచ్చ, పచ్చ లేవు..

- గుండు సుధారాణి



- సోషల్ మీడియాలో హైలైట్ కావాలనే కొండా సుస్మిత అర్థంలేని ఆరోపణలు చేస్తున్నారన్న సుధారాణి
- సురేఖపై కుట్రలు చేయాల్సిన అవసరం రేవంత్ కు లేదని వ్యాఖ్య
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో పార్టీని బలోపేతం చేయడమే తన లక్ష్యమన్న సుధారాణి

నిత్యం నిఘా, వరంగల్ : రాష్ట్రంలో అచ్చ కాంగ్రెస్, పచ్చ కాంగ్రెస్ అంటూ ఎలాంటి వర్గాలు లేవని... పార్టీలో ఉన్న వారంతా ఒకే జెండా, ఒకే సిద్ధాంతం ప్రాతిపదికగా పనిచేస్తున్నారని కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) నూతన చైర్‌పర్సన్ గుండు సుధారాణి స్పష్టం చేశారు. బీసీ వర్గానికి చెందిన తనకు ఊహించని విధంగా 'కుడా' చైర్‌పర్సన్ స్థానాన్ని కట్టబెట్టి గౌరవించినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, పార్టీ అధిష్ఠానానికి ఆమె ధన్యవాదాలు తెలిపారు. ఇదే సమయంలో బర్తరఫ్‌కు గురైన మాజీ మంత్రి కొండా సురేఖ, ఆమె కుమార్తె కొండా సుస్మితల వైఖరిపై సుధారాణి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కేవలం సోషల్ మీడియాలో పబ్లిసిటీ పొంది హైలైట్ అవ్వాలనే ఉద్దేశంతోనే కొండా సుస్మిత ఆధారాలు లేని, అర్థం లేని ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. అన్ని రాజకీయ పార్టీలు తిరిగి మళ్లీ కాంగ్రెస్ గూటికి వచ్చింది కొండా కుటుంబం కాదా? అని ప్రశ్నించారు. కొండా సురేఖపై కుట్రలు చేయాల్సిన అవసరం ముఖ్యమంత్రికి ఎంతమాత్రం లేదని, నిరంతరం ప్రతికూల ప్రచారంతో ప్రజల దృష్టిని ఆకర్షించేందుకు సురేఖ ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ఇకపై ముఖ్యమంత్రిపై కానీ, కాంగ్రెస్ ప్రభుత్వంపై కానీ కొండా కుటుంబం లేనిపోని విమర్శలు చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని, హెచ్చరించారు.

ప్రశ్నించే గొంతుకగా.. ప్రజల పక్షాన జంగా



Nityam Nigha 05.09.26_Layout 1 9/5/2026 6:14 AM Page 2

ట్రంప్ దృష్టిలో మోదీ అగ్రస్థానంలో ఉంటారు..

అమెరికా రాయబారి ఆసక్తికర వ్యాఖ్యలు!

మొదటిపేజీ తరువాయి.. జీ20 సదస్సు కోసం భారత ప్రధాని నరేంద్ర మోదీ అమెరికా వెళ్లనున్న నేపథ్యంలో ఇరు దేశాల మధ్య కీలక పరిణామాలు చోటుచేసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. మోదీని కలవాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఎంతగానో కోరుకుంటున్నారని అమెరికా రాయబారి సెర్గియో గోర్ తెలిపారు. డిసెంబర్‌లో ఫ్లోరిడాలో జరిగే జీ20 సదస్సు కేవలం బహుపాక్షిక సమావేశాలకే పరిమితం కాకపోవచ్చని ఆయన వ్యాఖ్యానించారు. ట్రంప్ దృష్టిలో మోదీ స్నేహితుడని, 35 మంది నేతలు వస్తే ఎవరిని కలవాలనుకుంటారని అడిగితే.. మోదీ ఆయన జాబితాలో అగ్రస్థానంలో ఉంటారని గోర్ చెప్పారు. 2020లో భారత పర్యటనను ట్రంప్ ఇప్పటికీ ఎంతో ఇష్టంగా గుర్తుచేసుకుంటున్నారని, వచ్చే ఏడాది ఆయన భారత్‌కు వచ్చే అవకాశం కూడా ఉందని సంకేతాలు ఇచ్చారు. అమెరికా–భారత్ సంబంధాలు ఇతర దేశాలు అసూయపడే రీతిలో ఉన్నాయని వ్యాఖ్యానించారు. భారత్–అమెరికా వాణిజ్య ఒప్పందంపై కూడా గోర్ కీలక వ్యాఖ్యలు చేశారు. అమెరికా సుప్రీంకోర్టు తీర్పు తర్వాత చర్చలను మళ్లీ కొనసాగిస్తున్నామని, ఒప్పందం "చాలా దగ్గర్లోనే ఉంది" అని తెలిపారు. రాబోయే కొన్ని నెలల్లో ఒప్పందం ఖరారవుతుందని ఆశిస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం సుమారు 240 బిలియన్ డాలర్లు ఉండగా.. దీన్ని 500 బిలియన్ డాలర్లకు పెంచాలని మోదీ, ట్రంప్ లక్ష్యంగా పెట్టుకున్నారు.

సర్టిఫికెట్లు లేకున్నా అప్లై చేసుకోవచ్చు..

- తెలంగాణలో కొత్త పింఛన్ దరఖాస్తుదారులకు ఉపశమనం

మొదటిపేజీ తరువాయి.. ఈ నేపథ్యంలో సర్టిఫికెట్ల కోసం ఆగకుండా ముందుగా ఆన్‌లైన్‌లో లేదా నిర్దేశిత మీసేవా కేంద్రాల్లో కొత్త పింఛన్‌కు దరఖాస్తు చేసుకోవచ్చని సెర్ప్ స్పష్టం చేసింది. అయితే ఇక్కడే ఓ కీలక నిబంధన ఉంది.

వెరిఫికేషన్‌లో మాత్రం తప్పనిసరి

దరఖాస్తు చేసే సమయంలో ధ్రువీకరణ పత్రాలు లేకపోయినా ఫర్వాలేదు. కానీ అధికారులు దరఖాస్తును పరిశీలించే సమయంలో మాత్రం సంబంధిత సర్టిఫికెట్లను తప్పనిసరిగా సమర్పించాలి. కాబట్టి దరఖాస్తు చేసుకున్న తర్వాత అవసరమైన ధ్రువీకరణ పత్రాలను సిద్ధం చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

సెప్టెంబర్ 15 వరకు అవకాశం

కొత్త పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకునేందుకు సెప్టెంబర్ 15 చివరి తేదీగా అధికారులు ప్రకటించారు. అర్హత ఉన్న వారు ఇంకా దరఖాస్తు చేయకపోతే ఎలాంటి ఆలస్యం చేయకుండా గడువులోపు అప్లై చేసుకోవాలని సూచించారు. గడువు ముగిసిన తర్వాత వచ్చే దరఖాస్తులను పరిగణనలోకి తీసుకునే అవకాశం ఉండదని స్పష్టం చేశారు. దీంతో అర్హులైన పేదలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరుతున్నారు.

కొండా సురేఖ బీఆర్ఎస్‌లో చేరుతారంటూ ప్రచారం..

తెలంగాణ భవన్ గేటు కూడా తాకనివ్వబోమన్న జగదీశ్ రెడ్డి

కొండా సురేఖ పార్టీ మారుతారంటూ పెద్ద ఎత్తున ప్రచారం

ఆమెను బీఆర్ఎస్‌లోకి రానిచ్చే ప్రసక్తే లేదన్న జగదీశ్ రెడ్డి

కోమటి రాజగోపాల్ రెడ్డిని కూడా చేర్చుకోబోమని వ్యాఖ్య



నిత్యం నిఘా, హైదరాబాద్ : మంత్రివర్గం నుంచి కొండా సురేఖను బర్తరఫ్ చేయడంతో తెలంగాణ రాజకీయాలు ఆసక్తికరంగా మారాయి. ఆమె బీఆర్ఎస్‌లో చేరుతారని ఓవైపు, బీజేపీలో చేరుతారని మరోవైపు పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. సురేఖ కాంగ్రెస్‌ను వీడి బీఆర్ఎస్‌లో చేరవచ్చనే ప్రచారాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. కొండా సురేఖను బీఆర్ఎస్‌లోకి రానిచ్చే ప్రసక్తే లేదని, ఆమెను ఆఖరికి తెలంగాణ భవన్ గేటును కూడా తాకని వ్వబోమని తేల్చిచెప్పారు. పార్టీని వీడి అధికార కాంగ్రెస్‌లోకి వెళ్లిన నేతలను తిరిగి చేర్చుకోబోమని.. వారిలో ఒకరిద్దరికి తప్ప మిగతా ఎవరికీ గులాబీ తలుపులు తెరిచేది లేదని స్పష్టం చేశారు. అదే సమయంలో, కాంగ్రెస్ నుంచి ఇప్పటికే ఇద్దరు ఎమ్మెల్యేలు బీఆర్ఎస్‌లోకి రావడానికి సిద్ధంగా ఉన్నారంటూ ఆయన సరికొత్త బాంబు పేల్చారు. ఇదే క్రమంలో కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిపై కూడా జగదీశ్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. రాజగోపాల్ రెడ్డి దరఖాస్తు చేసుకున్నా ఆయనను బీఆర్ఎస్‌లోకి తీసుకోమని చెప్పారు. ఒకవేళ రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఆయనకు మంత్రి పదవి కట్టబెడితే అది పూర్తిగా డబ్బులకు అమ్ముడుపోయినట్లేనని సంచలన ఆరోపణలు చేశారు. కొండా సురేఖ, ఆమె కుమార్తె సుస్మిత చేసిన తీవ్ర ఆరోపణలపై విచారణ జరపాలని డిమాండ్ చేసిన ఆయన... రాబోయే శాసనసభ సమావేశాల్లో కాంగ్రెస్ వైఫల్యాలను, ముఖ్యంగా 22ఏ భూముల స్కామ్‌ను ఎండగట్టేందుకు బీఆర్ఎస్ పక్కా వ్యూహాలతో సిద్ధంగా ఉందని వెల్లడించారు.

సన్నబియ్యాన్ని విక్రయిస్తే రేషన్ కార్డులు రద్దు - మంత్రి తుమ్మల

మొదటిపేజీ తరువాయి.. ప్రభుత్వం సంక్షేమ పథకాల కింద అందిస్తున్న సన్న బియ్యాన్ని లబ్ధిదారులు అక్రమంగా అమ్ముకుంటే వారి రేషన్ కార్డులను రద్దు చేస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తీవ్రంగా హెచ్చరించారు. పేదల ఆకలి తీర్చడానికి ఉద్దేశించిన బియ్యాన్ని దుర్వినియోగం చేస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన స్పష్టం చేశారు. శుక్రవారం ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం పూతాని తండాలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించిన అనంతరం ఏర్పాటు చేసిన సభలో మంత్రి ప్రసంగించారు. కొంతమంది లబ్ధిదారులు ప్రభుత్వం ఇస్తున్న సన్న బియ్యాన్ని బయట అమ్ముకుంటున్నట్లు తమ దృష్టికి వచ్చిందని మంత్రి తెలిపారు. ఇది చాలా తప్పుడు పద్ధతని, పేదల కోసం ఉద్దేశించిన పథకాలను దుర్వినియోగం చేయవద్దని హితవు పలికారు. ఇలాంటి చర్యలకు పాల్పడిన వారిని గుర్తించి, వారి రేషన్ కార్డులను రద్దు చేయడానికి కూడా వెనుకాడబోమని తేల్చి చెప్పారు. ఇక, అర్హులైన ప్రతి పేద కుటుంబానికి, ముఖ్యంగా గుడిసెల్లో నివసించే వారికి తక్షణమే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని మంత్రి అధికారులను, ప్రజాప్రతినిధులను ఆదేశించారు. ఇళ్ల కేటాయింపులో పార్టీలకు అతీతంగా పేదరికాన్నే ప్రామాణికంగా తీసుకోవాలని, ఈ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సర్పంచులు తమ పదవులు కోల్పోవాల్సి వస్తుందని గట్టిగా హెచ్చరించారు. ఈ ఏడాది వర్షపాతం తక్కువగా నమోదై పంటలు దెబ్బతినే ప్రమాదం ఉందని, తీవ్ర కరువు పరిస్థితులు ఎదురుకావచ్చని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారని తుమ్మల ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో, తక్కువ నీటితో అధిక దిగుబడినిచ్చే పామాయిల్ పంట సాగు చేపట్టాలని రైతులకు సూచించారు. పామాయిల్ సాగు చేసేవారికి అవసరమైన అన్ని సదుపాయాలను ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందని భరోసా ఇచ్చారు. రైతులకు భరోసా కల్పిస్తూ, రఘునాథపాలెం మండలానికి శుక్రవారం రాత్రికే సాగునీటిని విడుదల చేస్తున్నామని, రైతులు మరుసటి రోజు మోటార్లు ఆన్ చేసుకోవచ్చని తెలిపారు. ఆర్వీఎఫ్ఆర్ పట్టాలు ఉన్నవారికి బోరుబావుల అనుమతులు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న పోడు భూముల సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని, పూర్తిగా వ్యవసాయంపై ఆధారపడిన కుటుంబాలకు అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. అభివృద్ధి పనుల గురించి ప్రస్తావిస్తూ, మండలంలో రూ.75 కోట్లతో 200 డంపర్ రోడ్లతో పాటు పొలాలకు వెళ్లే దారులను నిర్మిస్తామని ప్రకటించారు. విద్య యొక్క ప్రాముఖ్యతను నొక్కిచెప్పిన ఆయన, త్వరలోనే ఒక స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను కూడా ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్, అటవీ శాఖ అధికారి అనుజ్ అగర్వాల్, భద్రాచలం ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ రాహుల్ తదితర అధికారులు పాల్గొన్నారు.

ఆ పోస్టులతో మాకు సంబంధం లేదు - కొండా సురేఖ స్పష్టీకరణ

మొదటిపేజీ తరువాయి.. తెలంగాణ కేబినెట్ నుంచి ఉద్వాసనకు గురైన కొండా సురేఖ, తన పేరుతో సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని ఖండించారు. తన కుటుంబానికి సంబంధం లేని కొన్ని పోస్టులు వివిధ సోషల్ మీడియా వేదికలపై సర్క్యులేట్ అవుతున్నాయని, వాటితో తమకు ఎలాంటి సంబంధం లేదని శుక్రవారం ఆమె 'ఎక్స్' వేదికగా స్పష్టం చేశారు. "త్వరలో బిగ్ అప్‌డేట్", "నిరీక్షణకు తెరపడనుంది" వంటి వ్యాఖ్యలతో ఉన్న పోస్టులు తన దృష్టికి వచ్చాయని, వాటిని ఎవరూ నమ్మవద్దని కోరారు. తన అధికారిక సోషల్ మీడియా ఖాతాల వివరాలను సైతం ఆమె పంచుకున్నారు. మంత్రి పదవి నుంచి తనను తొలగించిన మరుసటి రోజే ఈ ప్రచారం జరగడం గమనార్హం. క్రమశిక్షణా రాహిత్యం ఆరోపణలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన సిఫార్సు మేరకు గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా గురువారం కొండా సురేఖను కేబినెట్ నుంచి తొలగిస్తూ నోటిఫికేషన్ జారీ చేశారు. కాంగ్రెస్ అధిష్ఠానం ఆమోదం పొందిన తర్వాతే సీఎం ఈ నిర్ణయం తీసుకున్నారు. గత రెండు, మూడు రోజులుగా ఢిల్లీలో పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌లతో సహా రాష్ట్ర నాయకత్వంతో అధిష్ఠానం జరిపిన సంప్రదింపుల తర్వాత ఈ చర్యలు తీసుకున్నారు. గత నెలలో వరంగల్ జిల్లాలో జరిగిన ఓ కార్యక్రమంలో కొండా సురేఖ కుమార్తె సుస్మిత, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని లక్ష్యంగా చేసుకుని వ్యాఖ్యలు చేశారు. సీఎం కుటుంబ సభ్యులపై అవినీతి ఆరోపణలు కూడా చేశారు. వచ్చే ఎన్నికల్లో పరకాల నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డికే ఓటు వేయాలని సీఎం పిలుపునివ్వడంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అభ్యర్థిగా ప్రకాశ్ రెడ్డి బరిలో ఉన్నా, తాను పరకాల నుంచి పోటీ చేస్తానని సుస్మిత ప్రకటించారు. ఈ వ్యాఖ్యల నేపథ్యంలో పార్టీ క్రమశిక్షణ సంఘం సురేఖకు షోకాజ్ నోటీసు జారీ చేసింది. తన కుమార్తె చేసిన వ్యాఖ్యలకు తనను బాధ్యురాలిని చేయలేరని సురేఖ ఇచ్చిన సమాధానంపై పార్టీ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. క్రమశిక్షణ సంఘం ఆమెపై కఠిన చర్యలకు సిఫార్సు చేసింది. కాగా, కేబినెట్ నుంచి తనను తొలగించడాన్ని కొండా సురేఖ తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ అధిష్ఠానాన్ని సీఎం రేవంత్ రెడ్డి బ్లాక్ మెయిల్ చేసి తనను తొలగించారని ఆమె ఆరోపించారు. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ఎంపీ వేం నరేందర్ రెడ్డి ఈ కుట్ర వెనుక ఉన్నారని విమర్శించారు. అయితే, తాను, తన భర్త కొండా మురళి కాంగ్రెస్ పార్టీని వీడబోమని ఆమె స్పష్టం చేశారు. బీజేపీలో చేరడం లేదా కొత్త పార్టీ పెట్టడం వంటి ప్రచారాన్ని తోసిపుచ్చుతూ "నేను ఎక్కడికీ వెళ్లడం లేదు" అని స్పష్టం చేశారు.

కొండా సురేఖను తొలగించారు.. పొంగులేటి సంగతి ఏమిటి? : హరీశ్ రావు

మొదటిపేజీ తరువాయి.. తనను వ్యక్తిగతంగా విమర్శించారనే కారణంతోనే కొండా సురేఖను సీఎం రేవంత్ రెడ్డి మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేశారని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు ఆరోపించారు. సురేఖపై చర్యలు తీసుకున్న రేవంత్... 22ఏ నిషేధిత భూముల పేరిట రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది ప్రజలను, రైతులను పట్టి పీడిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని నిలదీశారు. రేవంత్ రెడ్డికి, పొంగులేటికి మధ్య ఉన్న రహస్య ఒప్పందం ఏమిటో ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు. పేదల పట్టా భూములను ఆదరాబాదరాగా నిషేధిత జాబితాలో చేర్చి తీవ్ర ఇబ్బందులకు గురిచేసిన పొంగులేటిని అసెంబ్లీకి రాకుండా నిషేధించాలని డిమాండ్ చేశారు. సూర్యుడి చుట్టూ భూమి తిరిగితే... కాంగ్రెస్ పాలనలో భూముల చుట్టూనే రేవంత్ రెడ్డి తిరుగుతున్నారని హరీశ్ రావు ధ్వజమెత్తారు. సీఎం రేవంత్ రెడ్డి ఇల్లు కూడా 22ఏ పరిధిలోనే ఉందని, తన ఇల్లు జాబితాలో పడగానే రాత్రికి రాత్రే ఆంక్షలు తొలగించుకున్న రేవంత్ రెడ్డి... పేద ప్రజల భూములకు వచ్చేసరికి ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రశ్నించారు. ఒక్క కాగజ్‌నగర్ నియోజకవర్గంలోనే ఏకంగా 42,867 ఎకరాల రైతుల పట్టా భూములను 22ఏ జాబితాలో బందీ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నిషేధిత జాబితాలోని పేదల భూములను విడుదల చేయాలని, లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న రైతులతో కలిసి అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. భూ సమస్యలపై ప్రశ్నిస్తున్న రైతులను కబ్జాదారులు అని సంబోధిస్తూ అవమానించిన రేవంత్ రెడ్డి తక్షణమే బేషరతుగా క్షమాపణ చెప్పాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. భూములు 22ఏ జాబితాలోకి వెళ్లడంతో బ్యాంకులు రుణాలు ఇవ్వకుండా రైతులను ఇబ్బందులు పెడుతున్నాయని మండిపడ్డారు. ఇది ఇందిరమ్మ రాజ్యమా లేక కబ్జాల రాజ్యమా అని నిలదీశారు.

కాంగ్రెస్ పార్టీలో వర్గపోరు లేదు..

నాయకులంతా ఏకతాటిపై ఉన్నారు - వివేక్ వెంకటస్వామి

- **కాంగ్రెస్ నేతలంతా రాష్ట్ర అభివృద్ధి కోసం కట్టుబడి ఉన్నారన్న వివేక్**
- **వెయ్యి రోజుల పాలనలో ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేశామని వెల్లడి**
- **22ఏ జీవోను పునఃపరిశీలిస్తున్నామన్న మంత్రి**

నిత్యం నిఘా, హైదరాబాద్ : కాంగ్రెస్ పార్టీలో ఎక్కడా వర్గపోరు లేదని, నాయకులంతా ఏకతాటిపై నిలిచి పార్టీ బలోపేతంతో పాటు రాష్ట్ర అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తున్నారని తెలంగాణ మంత్రి వివేక్ వెంకటస్వామి స్పష్టం చేశారు. మంచిర్యాల జిల్లా పర్యటనలో భాగంగా పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన, అనంతరం మీడియాతో మాట్లాడుతూ రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో ఎన్నో చారిత్రాత్మక సంక్షేమ పథకాలను అమలు చేసి ప్రజాదరణ పొందిందని వెల్లడించారు. రాష్ట్రంలో తీవ్ర చర్చనీయాంశంగా మారిన 22ఏ నిరోధిత భూముల వివాదంపై మంత్రి స్పందిస్తూ... ఈ సమస్య ముమ్మాటికీ గత బీఆర్ఎస్ ప్రభుత్వ నిర్లక్ష్యం, అనాలోచిత నిర్ణయాల వల్లే ఉత్పన్నమైందని మండిపడ్డారు. ఆనాటి జీవోను పునఃపరిశీలించి, సవరణలు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు వేగవంతం చేసిందని, ఏ ఒక్క రైతుకూ అన్యాయం జరగకుండా నిరోధిత జాబితా చిక్కులను త్వరలోనే పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ప్రతికూలంగా ఉన్నప్పటికీ, ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నిబద్ధతతో నెరవేరుస్తున్నామని పేర్కొన్నారు. కేసీఆర్ హయాంలో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు అక్రమాలు, డిజైన్ లోపాల వల్లే మేడిగడ్డ బ్యారేజ్ కుంగిపోయిందని ఆరోపించిన మంత్రి వివేక్, ఈ వైఫల్యంపై మాజీ నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్ రావు ప్రజలకు బహిరంగ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ నేతలు ఉనికి కోసమే ప్రభుత్వంపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని, గత పదేళ్ల స్వార్థ పాలనను ప్రజలు ఇంకా మరచిపోలేదని ఆయన వ్యాఖ్యానించారు.




Nityam Nigha 05.09.26_Layout 1 9/5/2026 6:14 AM Page 3

ప్రశ్నించే గొంతుకగా.. ప్రజల పక్షాన జంగా

విద్యార్థి దశ నుంచే ప్రజా ఉద్యమాల్లోకి వచ్చా.. నిర్బంధాలే నన్ను రాజకీయంగా తీర్చిదిద్దాయి

డీసీసీబీ, ఆయిల్‌ఫెడ్‌లో రైతుల కోసం పనిచేశా.. గ్రేటర్ వరంగల్ మేయర్ రేసులో ఉన్నా

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కచ్చితంగా బరిలో ఉంటా - కాంగ్రెస్ సీనియర్ నేత జంగా రాఘవరెడ్డి



హన్మకొండ, సెప్టెంబర్ 04 (నిత్యం నిఘా ప్రతినిధి):

విద్యార్థి దశ నుంచే ప్రజా సమస్యలపై పోరాటాలు చేస్తూ, అనేక నిర్బంధాలు, కేసులు ఎదుర్కొంటూ రాజకీయంగా ఎదిగానని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, తెలంగాణ ఆయిల్‌ఫెడ్ కార్పొరేషన్ తాజా మాజీ చైర్మన్ జంగా రాఘవరెడ్డి అన్నారు. పదవులు ఉన్నా లేకపోయినా ప్రజల మధ్యే ఉంటూ పార్టీ కోసం నిరంతరం పనిచేస్తున్నానని తెలిపారు. తెలంగాణ డిజిటల్ మీడియా ప్రతినిధులతో నిర్వహించిన చిట్‌చాట్‌లో తన రాజకీయ ప్రస్థానం, ప్రజా ఉద్యమాలు, రైతుల కోసం చేపట్టిన కార్యక్రమాలు, గ్రేటర్ వరంగల్ రాజకీయాలు, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తన లక్ష్యాలపై ఆయన మాట్లాడారు.

* నిర్బంధాల నుంచే రాజకీయ ప్రస్థానం



తమ కుటుంబం మొదటి నుంచీ కాంగ్రెస్ పార్టీతో అనుబంధం కలిగి ఉందని జంగా రాఘవరెడ్డి తెలిపారు. తన తండ్రి సర్పంచ్‌గా పనిచేశారని, తాను మాత్రం పాఠశాల దశ నుంచే విద్యార్థి రాజకీయాల్లోకి వచ్చానని చెప్పారు. ప్రజా సమస్యలపై పోరాటాలు చేస్తున్న క్రమంలో అప్పటి ప్రభుత్వాల నుంచి అనేక నిర్బంధాలను ఎదుర్కొన్నానని, పోలీసుల నుంచి ఇబ్బందులు ఎదురైనా వెనక్కి తగ్గలేదన్నారు. విద్యార్థి దశలో సుధాకర్‌గాంధీ తన రాజకీయ గురువుగా పేర్కొన్నారు. ఆయన ప్రోత్సాహంతోనే ప్రజా ఉద్యమాల్లోకి వచ్చానని తెలిపారు. ప్రజల సమస్యలపై ప్రశ్నించడం నేర్చుకున్నానని, ప్రశ్నించకుండా సమస్యలు పరిష్కారం కావని అన్నారు. నిర్బంధాలు, కేసులు, కష్టాలు ఎదురైన ప్రతిసారీ మరింత పట్టుదలతో పనిచేశానని చెప్పారు.

* రైతుల కోసం పనిచేశా



కాంట్రాక్టర్, వ్యాపారవేత్తగా కొనసాగుతూనే రాజకీయాల్లో చురుగ్గా పనిచేశానని జంగా తెలిపారు. కాజీపేట దర్గా పీఏసీఎస్ చైర్మన్‌గా రెండుసార్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యానని, అనంతరం ఉమ్మడి వరంగల్ జిల్లా డీసీసీబీ చైర్మన్‌గా పనిచేశానని చెప్పారు. ఆ సమయంలో రైతులకు మేలు చేసే పలు కార్యక్రమాలు చేపట్టడంతో పాటు డీసీసీబీని బలోపేతం చేసేందుకు కృషి చేశానన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తెలంగాణ స్టేట్ సీడ్స్ అండ్ ఆయిల్‌ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టానని తెలిపారు. రాష్ట్రంలో ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహించేందుకు కృషి చేశానని, రైతులకు దీర్ఘకాలికంగా ఆదాయం వచ్చేలా ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన కల్పించామని చెప్పారు. రైతులను ఆర్థికంగా బలోపేతం చేయడమే తన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

* పలు నియోజకవర్గాల్లో ప్రత్యేక బలం



జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి, వరంగల్ పశ్చిమ, వర్ధన్నపేట నియోజకవర్గాల్లో తనకు ప్రత్యేకంగా పనిచేసే కార్యకర్తల బలం, ప్రజలతో అనుబంధం ఉందని జంగా రాఘవరెడ్డి అన్నారు. ఆయా నియోజకవర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థుల విజయానికి తన వంతు పాత్ర ఉంటుందని తెలిపారు. 'జంగా అంటే ఒక వ్యక్తి మాత్రమే కాదు.. అనేక నియోజకవర్గాల్లో ప్రజలతో ఉన్న అనుబంధం, కార్యకర్తల బలం కలిసిన రాజకీయ శక్తి' అని ఆయన పేర్కొన్నారు.

* మేయర్ రేసులో ఉన్నా

రానున్న గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో తాను మేయర్ రేసులో ఉన్నానని జంగా రాఘవరెడ్డి స్పష్టం చేశారు. తన కుమార్తె డాక్టర్ నిఖితారెడ్డి కూడా ఎన్నికల బరిలో ఉంటారని తెలిపారు. దశాబ్దాలుగా గ్రేటర్ వరంగల్ ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నానని చెప్పారు. మహిళలు, కార్మికులు, రైతులు, ఉద్యోగులు, విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యలపై పోరాడుతున్నానన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నానని, పదవి ఉన్నప్పుడే ప్రజల వద్దకు వెళ్లే నాయకున్ని కాదని పేర్కొన్నారు.

* వచ్చే అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యం

దేశవ్యాప్తంగా జరుగుతున్న నియోజకవర్గాల పునర్విభజన ప్రభావం తెలంగాణపై కూడా ఉండే అవకాశం ఉందని జంగా రాఘవరెడ్డి అన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో నియోజకవర్గాల స్వరూపం మారే అవకాశాలను పరిశీలిస్తున్నానని తెలిపారు. డీలిమిటేషన్ తర్వాత తాను ఎక్కడి నుంచి పోటీ చేయాలనేది నిర్ణయించుకుంటానని, అయితే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో మాత్రం కచ్చితంగా బరిలో ఉంటానని స్పష్టం చేశారు. అనేక ఎన్నికల్లో పార్టీ అధిష్ఠానం నిర్ణయానికి కట్టుబడి పనిచేశానని, ఎక్కడా ధిక్కరించలేదని తెలిపారు. పార్టీ కోసం రాజకీయంగా, ఆర్థికంగా నష్టపోయినా కాంగ్రెస్‌ను వీడలేదని, వచ్చే ఎన్నికల్లో పార్టీ తనకు మంచి అవకాశం ఇస్తుందన్న నమ్మకం ఉందన్నారు.

* జర్నలిస్టులు ప్రజల పక్షాన ఉండాలి



రాజకీయాలతో పాటు పాత్రికేయ రంగంలోనూ కొన్ని మార్పులు చోటుచేసుకోవడం బాధ కలిగిస్తోందని జంగా రాఘవరెడ్డి అన్నారు. గతంలో రాజకీయాల్లో నైతిక విలువలకు ప్రాధాన్యం ఉండేదని, ప్రస్తుతం పవర్ పాలిటిక్స్, మనీ పాలిటిక్స్ పెరిగాయని అభిప్రాయపడ్డారు. పత్రికలు ప్రతిపక్ష పాత్ర పోషించాలని, జర్నలిస్టులు ప్రజల పక్షాన నిలవాలని సూచించారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు ప్రభుత్వాలు తప్పు చేసినప్పుడు ప్రశ్నించాలని అన్నారు. ప్రజా ప్రయోజనాల పరిరక్షణలో పాత్రికేయుల పాత్ర ఎంతో కీలకమని జంగా రాఘవరెడ్డి పేర్కొన్నారు.

Nityam Nigha 05.09.26_Layout 1 9/5/2026 6:14 AM Page 4

కాంగ్రెస్ హామీలన్నీ నీటి మూటలే..

బీసీలను తీవ్రంగా వంచించారు

- రూ.20 వేల కోట్ల బీసీ బడ్జెట్ హామీ ఏమైంది?
- 1,000 రోజుల పాలనపై సంబరాలకు కాంగ్రెస్‌కు నైతిక హక్కు లేదు
- శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి ధ్వజం



హన్మకొండ,సెప్టెంబర్ 04 (నిత్యం నిఘా ప్రతినిధి): ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కదానిని ప్రభుత్వం పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదని, ముఖ్యంగా బీసీ వర్గాలను కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్రంగా మోసం చేసిందని శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి విమర్శించారు. హన్మకొండ బాలసముద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.ఈ సందర్భంగా సిరికొండ మధుసూదనాచారి మాట్లాడుతూ.. ప్రతి బడ్జెట్‌లో బీసీ సంక్షేమానికి రూ.20 వేల కోట్లు కేటాయిస్తామని ఎన్నికల సమయంలో కాంగ్రెస్ హామీ ఇచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చిన అనంతరం ఆ హామీని ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చి అమలు చేయని హామీల జాబితా రోజురోజుకూ పెరుగుతోందని విమర్శించారు. ప్రభుత్వం ఇటీవల 1,000 రోజుల పాలన పూర్తయిందంటూ సంబరాలు నిర్వహించడాన్ని ఆయన తప్పుబట్టారు. ప్రజా సంక్షేమాన్ని విస్మరించి, ఎన్నికల హామీలను అమలు చేయడంలో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వానికి పాలనపై సంబరాలు చేసుకునే నైతిక హక్కు లేదన్నారు.బీసీల సంక్షేమం, అభివృద్ధికి ఇచ్చిన హామీలను ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని సిరికొండ మధుసూదనాచారి డిమాండ్ చేశారు.

విద్యుత్ సమస్యలను విస్మరిస్తున్న అధికారులు.. ప్రజల ప్రాణాలతో చెలగాటమా?

- సమస్యలు పరిష్కరించకుంటే విద్యుత్ కార్యాలయం ముట్టడినిరాహార దీక్షకు సిద్ధం..
- 6వ వార్డు కౌన్సిలర్ పోతరవేని శ్రీలతక్రాంతి హెచ్చరిక

పెద్దపల్లి జిల్లా /మంథని, సెప్టెంబర్ 04 (నిత్యం నిఘా ప్రతినిధి): మంథని మున్సిపాలిటీ 6వ వార్డు పరిధిలోని బోయినపేట ప్రాంతంలో నెలకొన్న తీవ్ర విద్యుత్ సమస్యలను అధికారులు పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని 6వ వార్డు కౌన్సిలర్ పోతరవేని శ్రీలతక్రాంతి మండిపడ్డారు. ప్రజల భద్రతకు సంబంధించిన సమస్యలపై విద్యుత్ శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ కార్యక్రమంలో భాగంగా కొత్తగా ఇళ్లు నిర్మిస్తున్న ప్రాంతాల్లో అవసరమైన చోట విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. ఇళ్ల నిర్మాణానికి అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాలు, తీగలను తొలగించి నిర్మాణ పనులకు ఆటంకం లేకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. బోయినపేటలోని పలు వాడల్లో విద్యుత్ స్తంభాలు లేకపోవడంతో రాత్రి వేళల్లో ప్రజలు చిమ్మచీకటిలో రాకపోకలు సాగించాల్సి వస్తోందని తెలిపారు. చిన్నారులు, వృద్ధులు, మహిళలు రాత్రి వేళల్లో బయటకు రావడానికి భయపడుతున్నారని పేర్కొన్నారు. చీకటి కారణంగా విష సర్పాలు, ఇతర జంతువుల వల్ల ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ఆమె ప్రశ్నించారు. కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికే ఉన్న విద్యుత్ స్తంభాలు విరిగిపోయి ప్రమాదకరంగా మారాయని, మరికొన్ని చోట్ల పాత ఇనుప స్తంభాలు శిథిలావస్థకు చేరాయని ఆందోళన వ్యక్తం చేశారు. వర్షాలు, ఈదురుగాలులు, గాలిదుమారాల సమయంలో బలహీనమైన స్తంభాలు విరిగి పడితే ప్రాణనష్టం జరిగే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బోయినపేటకు వెళ్లే ప్రధాన మార్గమైన పాత కట్టపై విద్యుత్ స్తంభాలు లేకపోవడంతో రాత్రి వేళల్లో రహదారి మొత్తం చీకటిగా మారుతోందన్నారు. ఈ మార్గంలో నిత్యం ప్రజలు, వాహనదారులు ప్రయాణిస్తున్నందున ప్రమాదాలు జరగకముందే అవసరమైన చోట విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి వీధి దీపాల సమస్యను పరిష్కరించాలని కోరారు.



బోయినపేటలో విద్యుత్ సమస్యలు చాలా కాలంగా కొనసాగుతున్నాయని, పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారానికి చర్యలు తీసుకోవడం లేదని శ్రీలతక్రాంతి విమర్శించారు. ఇకనైనా అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి విద్యుత్ స్తంభాలు, తీగలు, వీధి దీపాలు, మీటర్ కనెక్షన్లకు సంబంధించిన సమస్యలను సమగ్రంగా పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారంలో ఇంకా నిర్లక్ష్యం చేస్తే ప్రజలను సమీకరించి విద్యుత్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. సమస్యలు పరిష్కారమయ్యే వరకు ఆందోళన కొనసాగిస్తామని, అవసరమైతే నిరాహార దీక్షకు కూడా వెనుకాడబోమని శ్రీలతక్రాంతి స్పష్టం చేశారు.

ప్రజల సమస్యలపై తక్షణ స్పందన.. పరిసరాల పరిశుభ్రతకు సర్పంచ్ చర్యలు

- లింగాలలో పిచ్చిమొక్కలు, చెత్తాచెదారం తొలగింపు
- పాముల బెడద నుంచి ప్రజలు, విద్యార్థులకు ఉపశమనం

ములుగుజిల్లా/ తాడ్వాయి, సెప్టెంబర్04 (నిత్యం నిఘా ప్రతినిధి): ప్రజల సమస్యలపై తక్షణమే స్పందిస్తూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు లింగాల గ్రామ సర్పంచ్ మొగిలిపల్లి రవీందర్ చర్యలు చేపట్టారు. తాడువాయి మండల పరిధిలోని లింగాల గ్రామ పంచాయతీకి చెందిన మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వెనుక భాగంలో ఉన్న నిరుపయోగంగా మారిన ఇంటి ఆవరణను శుభ్రం చేయించారు. జనగం నారాయణకు చెందిన ఈ ఇల్లు గత ఆరు సంవత్సరాలుగా ఖాళీగా ఉండటంతో ఆవరణ మొత్తం పిచ్చిమొక్కలు, చెత్తాచెదారంతో నిండిపోయింది. దీంతో విషసర్పాలకు ఆ ప్రాంతం ఆవాసంగా మారింది. తరచూ పాములు చుట్టుపక్కల ఇళ్లలోకి, సమీపంలోని పాఠశాలలోకి ప్రవేశించడంతో స్థానికులు, విద్యార్థులు, పాఠశాల సిబ్బంది భయాందోళనకు గురయ్యారు. ఈ విషయాన్ని స్థానికులు సర్పంచ్ మొగిలిపల్లి రవీందర్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన వెంటనే స్పందించారు. డోజర్, ట్రాక్టర్లను ఏర్పాటు చేసి నిరుపయోగంగా ఉన్న ఇంటి ఆవరణలోని పిచ్చిమొక్కలు, చెత్తాచెదారాన్ని తొలగించి పరిసరాలను పరిశుభ్రం చేయించారు. సర్పంచ్ వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించడంతో స్థానికులు, విద్యార్థులు, పాఠశాల సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. ప్రజల భద్రత, పారిశుద్ధ్యంపై సర్పంచ్ తీసుకున్న చర్యలను గ్రామస్తులు అభినందించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ మొగిలిపల్లి రవీందర్, వార్డు సభ్యుడు చేపల సురేష్, కోరం రంజిత్, గ్రామస్తులు పూసం సుధాకర్, నారాయణ, రాము, మహేష్ తదితరులు పాల్గొన్నారు



పుష్కరాల నాటికి భద్రాద్రి ఆలయ పునరాభివృద్ధి పనులు పూర్తి చేయాలి

- రూ.351 కోట్లతో చేపట్టిన పనులను పరిశీలించిన మంత్రి పొంగులేటి
- నాణ్యతలో రాజీ లేకుండా నిర్ణీత గడువులో పూర్తి చేయాలని ఆదేశం



భద్రాచలం,సెప్టెంబర్ 04 (నిత్యం నిఘా ప్రతినిధి): దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారి దేవస్థానం పునరాభివృద్ధి పనులను రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి శుక్రవారం ఉదయం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, వేద పండితులు, దేవస్థాన అధికారులు మంత్రికి ఘన స్వాగతం పలికారు. వేదమంత్రోచ్చారణల మధ్య శ్రీసీతారామచంద్రస్వామివారిని దర్శించుకున్న మంత్రి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం అర్చకులు వేదాశీర్వచనం అందించి తీర్థప్రసాదాలు అందజేశారు. తదుపరి తెలంగాణ ప్రజా ప్రభుత్వం తొలి దశలో రూ.351 కోట్లతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆలయ పునరాభివృద్ధి పనులను మంత్రి పరిశీలించారు. మాడవీధుల నిర్మాణం, మౌలిక వసతుల కల్పన తదితర పనుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. 2027లో జరగనున్న గోదావరి పుష్కరాల నాటికి పనులన్నీ పూర్తి చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. నిర్మాణ పనుల్లో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని, నిర్ణీత గడువులో పనులను పూర్తి చేయాలని సూచించారు. శ్రీసీతారామచంద్రస్వామివారి ఆశీస్సులతో భద్రాద్రి ఆలయ అభివృద్ధి పనులు అనుకున్న సమయానికి పూర్తికావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, తెల్లం వెంకట్రావు, జారే ఆదినారాయణ, కలెక్టర్, నిర్మాణ సంస్థ ప్రతినిధులు, స్థపతి, స్థానిక ప్రజా ప్రతినిధులు, ఆలయ ఈవో, వేద పండితులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



బంధువుల ఇంటికి వచ్చి.. కాల్వలో శవమై తేలిన యువకుడు

- ముత్తారం మండలం కేశనపల్లిలో విషాద ఘటన
- మృతుడు మందమర్రికి చెందిన బండ సాయిరాం (21)



పెద్దపల్లి జిల్లా / ముత్తారం, సెప్టెంబర్ 4 (నిత్యం నిఘా ప్రతినిధి): పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని కేశనపల్లి గ్రామ సమీపంలో కెనాల్ కాల్వలో యువకుడి మృతదేహం లభ్యమైన ఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. మృతుడిని మంచిర్యాల జిల్లా మందమర్రికి చెందిన బండ సాయిరాం (21)గా పోలీసులు గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సాయిరాం మూడు రోజుల క్రితం ముత్తారం మండలంలోని హరిపురం గ్రామంలో ఉన్న బంధువుల ఇంటికి వచ్చాడు. అక్కడి నుంచి ఖమ్మంపల్లి గ్రామంలోని మరో బంధువుల ఇంటికి వెళ్లేందుకు బయలుదేరాడు. ఈ క్రమంలో కేశనపల్లి గ్రామ సమీపంలోని కెనాల్ కాల్వలో ప్రమాదవశాత్తు పడిపోయినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. శుక్రవారం కేశనపల్లి గ్రామ సమీపంలోని కెనాల్ కాల్వలో సాయిరాం మృతదేహం తేలడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సాయిరాం కాల్వలో ఎలా పడ్డాడు? ప్రమాదవశాత్తు జరిగిందా, మరేదైనా కారణమా? అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

ఎంజీఎంలో మార్త నాగరాజు తండ్రికి పరామర్శ

- మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరిన తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా అధ్యక్షుడు పెండేల సంపత్ పటేల్

వరంగల్ , సెప్టెంబర్ 4 (నిత్యం నిఘా ప్రతినిధి): నర్సంపేట నియోజకవర్గం నల్లబెల్లి మండల అధ్యక్షుడు మార్త నాగరాజు తండ్రి పక్షవాతంతో ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న తెలంగాణ రాజ్యాధికార పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు పెండేల సంపత్ పటేల్ గురువారం ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా నాగరాజు తండ్రి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. అనంతరం వైద్యులను కలిసి ఆయనకు అందుతున్న చికిత్సపై వివరాలు తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించి త్వరగా కోలుకునేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని వైద్యులను కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ వరంగల్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ధర్మపురి రామారావు, గ్రేటర్ వరంగల్ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాసరావు పటేల్, మెడికల్ సతీష్, 28వ డివిజన్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్‌రెడ్డిని కలిసిన కుడా చైర్మన్ గుండు సుధారాణి

- మర్యాదపూర్వక భేటీ.. శుభాకాంక్షలు తెలిపిన ఇనగాల

హన్మకొండ, సెప్టెంబర్ 04 (నిత్యం నిఘా ప్రతినిధి): వరంగల్ కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా) చైర్మన్‌గా నియమితులైన గుండు సుధారాణి శుక్రవారం హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. హనుమకొండ రామకృష్ణ కాలనీలోని ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి నివాసానికి వెళ్లిన ఆమె పుష్పగుచ్ఛం అందజేశారు.ఈ సందర్భంగా ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి కుడా చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించనున్న గుండు సుధారాణిని శాలువాతో సత్కరించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. కుడా పరిధిలో అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షించారు.

Nityam Nigha 05.09.26_Layout 1 9/5/2026 6:14 AM Page 5

సీసీ కెమెరాల నిఘా సరే.. వ్యక్తిగత గోప్యత సంగతేంటి?

- భద్రత కోసం ఏర్పాటు చేసిన కెమెరాలపై గ్రామస్తుల సందేహాలు
- ఫుటేజీని ఎవరు పరిశీలిస్తున్నారు.. ఏ సందర్భాల్లో చూస్తున్నారు?
- పర్యవేక్షణ విధానంపై అధికారులు స్పష్టత ఇవ్వాలని డిమాండ్



ఎల్కతుర్తి, సెప్టెంబర్ 04 (నిత్యం నిఘా ప్రతినిధి): ప్రజల భద్రత, నేరాల నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయడం, ఏదైనా సంఘటన జరిగినప్పుడు వాస్తవాలను గుర్తించడంలో సీసీ కెమెరాలు కీలకంగా ఉపయోగపడుతున్నాయి. ఈ నేపథ్యంలో ఎల్కతుర్తి మండలంలోని ఓ గ్రామంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల వ్యవస్థను గ్రామస్తులు స్వాగతిస్తున్నారు. అయితే వాటి పర్యవేక్షణ, ఫుటేజీ వినియోగ విధానంపై కొంతమంది గ్రామస్తుల్లో సందేహాలు వ్యక్తమవుతున్నాయి. కెమెరాల్లో రికార్డయ్యే దృశ్యాలను ఎవరు పరిశీలిస్తున్నారు? ఏ సందర్భాల్లో ఫుటేజీని చూస్తున్నారు? వాటిని ఎంతకాలం భద్రపరుస్తున్నారు? ఇతరులకు ఫుటేజీని అందించే అవకాశం ఉందా? వంటి అంశాలపై స్పష్టత అవసరమని గ్రామస్తులు కోరుతున్నారు.

• భద్రతకు కెమెరాలు అవసరమే.. పర్యవేక్షణకు పరిమితులు ఉండాలి

సీసీ కెమెరాల ఏర్పాటును తాము వ్యతిరేకించడం లేదని గ్రామస్తులు చెబుతున్నారు. దొంగతనాలు, గొడవలు, ఇతర అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకున్నప్పుడు సీసీ కెమెరాల ఫుటేజీ దర్యాప్తులో కీలక ఆధారంగా ఉపయోగపడుతుందని పేర్కొంటున్నారు. అయితే కెమెరాల ప్రధాన ఉద్దేశం ప్రజల భద్రతకే పరిమితం కావాలని, ప్రతి వ్యక్తి కదలికలను నిరంతరం ఎవరో గమనిస్తున్నారనే భావన ప్రజల్లో కలగకుండా చూడాల్సిన అవసరం ఉందని వారు అభిప్రాయపడుతున్నారు.

*** 'ఎక్కడికి వెళ్లినా గమనిస్తున్నారనే భావన'**

గ్రామంలో ఏదైనా చిన్న సంఘటన జరిగినప్పుడు సీసీ కెమెరాల ద్వారా సమాచారం తెలుసుకుని కొందరు ఫుటేజీని పరిశీలిస్తున్నారనే చర్చ జరుగుతోందని గ్రామస్తులు చెబుతున్నారు. అంతేకాకుండా 'అక్కడ ఎవరు ఉన్నారు?', 'ఏం జరిగింది?', 'ఎందుకు వచ్చారు?' వంటి ప్రశ్నలతో ఫోన్ ద్వారా వివరాలు అడగడం కొంతమందికి అసౌకర్యంగా అనిపిస్తోందని పేర్కొంటున్నారు. దీంతో గ్రామంలో ఎక్కడికి వెళ్లినా ఎవరో ఒకరు తమను గమనిస్తున్నారనే భావన కలుగుతోందని కొందరు గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ అంశంపై అధికారికంగా ఏదైనా నిర్ధారణ జరిగిందా? ఫుటేజీని ఎలాంటి నిబంధనల ప్రకారం పరిశీలిస్తున్నారు? అనే విషయాలు అధికారులు స్పష్టం చేయాలని కోరుతున్నారు.

*** భద్రతతో పాటు అభివృద్ధిపైనా దృష్టి అవసరం**

గ్రామ భద్రతపై గ్రామపంచాయతీ, సంబంధిత అధికారులు దృష్టి సారించడం అవసరమేనని గ్రామస్తులు అంటున్నారు. అదే సమయంలో పారిశుద్ధ్యం, తాగునీరు, రహదారులు, డ్రైనేజీ, వీధి దీపాలు తదితర మౌలిక వసతులపై కూడా సమాన దృష్టి పెట్టాలని కోరుతున్నారు. భద్రతా చర్యలతో పాటు ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధి కార్యక్రమాలు సమాంతరంగా కొనసాగితేనే గ్రామాభివృద్ధి సమగ్రంగా ఉంటుందని వారు అభిప్రాయపడుతున్నారు.

*** కెమెరాలు రక్షణ కోసమే.. నిఘా భయానికి కాదు**

సీసీ కెమెరాలు ప్రజల్లో భద్రతా భావన కలిగించే వ్యవస్థగా ఉండాలే తప్ప, తమ ప్రతి కదలికను ఎవరో గమనిస్తున్నారనే భయాన్ని కలిగించే పరిస్థితి రావద్దని గ్రామస్తులు అంటున్నారు.నేరాల నియంత్రణ, మహిళలు, వృద్ధులు, చిన్నారులకు భద్రత కల్పించడం, అనుమానాస్పద ఘటనలను గుర్తించడం వంటి మంచి ఉద్దేశాలతో కెమెరాల వ్యవస్థ పనిచేస్తే ప్రజల నుంచి కూడా పూర్తి సహకారం లభిస్తుందని పేర్కొంటున్నారు.

*** అధికారులు స్పష్టత ఇవ్వాలి**

ఎల్కతుర్తి మండలంలోని ఆ గ్రామంలో సీసీ కెమెరాల నిర్వహణ, పర్యవేక్షణ విధానంపై జరుగుతున్న చర్చను సంబంధిత అధికారులు పరిశీలించాలని గ్రామస్తులు కోరుతున్నారు. కెమెరాల నిర్వహణ ఎవరి ఆధ్వర్యంలో ఉంది? ఫుటేజీని పరిశీలించే అధికారం ఎవరికి ఉంది? దాని వినియోగానికి ఏమైనా మార్గదర్శకాలు ఉన్నాయా? అనే విషయాలపై స్పష్టత ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రజల భద్రత కోసం సీసీ కెమెరాలు అవసరమే.. అదే సమయంలో వారి వ్యక్తిగత గోప్యత, గౌరవం కూడా అంతే ముఖ్యం. భద్రతకు, గోప్యతకు సమతుల్యత ఉండేలా కెమెరాల వినియోగంపై స్పష్టమైన విధానం అమలు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

- ★ ఫుటేజీని ఎవరు పరిశీలించవచ్చు?
- ★ ఏ సందర్భంలో పరిశీలించవచ్చు?
- ★ రికార్డులను ఎంతకాలం భద్రపరుస్తారు?
- ★ అవసరమైనప్పుడు పోలీసులకు లేదా సంబంధిత అధికారులకు ఎలా అందజేస్తారు?
- ★ అనవసరంగా వ్యక్తిగత దృశ్యాలను పరిశీలించకుండా ఎలాంటి నియంత్రణ ఉంటుంది?

అనే అంశాలపై గ్రామపంచాయతీ, సంబంధిత అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలని కోరుతున్నారు.

కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనపై బీఆర్ఎస్ భగ్గు

- మహిళలను హామీల పేరుతో మోసం చేశారు.. మహాలక్ష్మి, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ అమలు చేయాలి



దేవరుప్పుల/రాయపర్తి/తొర్రూరు,సెప్టెంబర్ 04 (నిత్యం నిఘా ప్రతినిధి) కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి వెయ్యి రోజులు పూర్తయినా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మూడో రోజు నిరసనలు కొనసాగాయి. పాలకుర్తి నియోజకవర్గంలోని దేవరుప్పుల, రాయపర్తి, తొర్రూరు మండల కేంద్రాల్లో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆధ్వర్యంలో ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉషా దయాకర్‌రావు, బీఆర్ఎస్ మహిళా నాయకులు, కార్యకర్తలు కలిసి 'వంటావార్పు' కార్యక్రమాలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి వెయ్యి రోజులు గడిచినా రాష్ట్ర ప్రజలకు చేసిందేమీ లేదని విమర్శించారు. ఆరు గ్యారంటీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదని ఆరోపించారు. మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయం అందిస్తామని హామీ ఇచ్చిన మహాలక్ష్మి పథకాన్ని అమలు చేయలేదన్నారు. కల్యాణలక్ష్మి , షాదీ ముబారక్, కేసీఆర్ కిట్ వంటి పథకాలను కొనసాగించడంతో పాటు తులం బంగారం ఇస్తామని ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. వృద్ధులు, ఒంటరి మహిళలకు నెలకు రూ.4 వేల పెన్షన్, వికలాంగులకు రూ.6 వేల పెన్షన్ ఇస్తామని హామీ ఇచ్చి విస్మరించిందని విమర్శించారు. మహిళలకు స్కూటీలు, ల్యాప్‌టాప్‌లు అందిస్తామని చెప్పిన హామీల పరిస్థితి ఏమిటో ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కల్యాణలక్ష్మి , కేసీఆర్ కిట్, పెన్షన్ల పెంపు వంటి పథకాలతో ప్రజలకు, మహిళలకు అండగా నిలిచామని ఎర్రబెల్లి దయాకర్‌రావు పేర్కొన్నారు. కేసీఆర్ పాలనే తెలంగాణకు శ్రీరామరక్ష అని అన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పోరాటాలను కొనసాగిస్తామని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా, మండల స్థాయి బీఆర్ఎస్ నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తకు అండగా నన్నపునేని నరేందర్

- బాబు మియాపై అక్రమ కేసులు పెట్టి నిర్బంధించడం సరికాదు
- తక్షణమే విడుదల చేయాలి.. కార్యకర్తలకు ఎలాంటి ఇబ్బంది వచ్చినా అండగా ఉంటా



వరంగల్, సెప్టెంబర్04 (నిత్యం నిఘా ప్రతినిధి): వరంగల్ తూర్పు నియోజకవర్గానికి చెందిన సోషల్ మీడియా కార్యకర్త బాబు మియాపై అక్రమ కేసులు నమోదు చేసి మిల్స్ కాలనీ పోలీస్‌స్టేషన్‌లో నిర్బంధించడాన్ని గ్రేటర్ వరంగల్ తొలి మేయర్, వరంగల్ తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ తీవ్రంగా ఖండించారు.రాజకీయ కక్షతో కార్యకర్తలపై కేసులు నమోదు చేసి ఇబ్బందులకు గురిచేయడం సరికాదని నన్నపునేని నరేందర్ అన్నారు. ప్రజాస్వామ్యంలో సోషల్ మీడియా వేదికగా ప్రభుత్వ విధానాలను ప్రశ్నించడం, ప్రజా సమస్యలను ప్రస్తావించడం ప్రతి ఒక్కరికీ ఉన్న హక్కు అని పేర్కొన్నారు.బాబు మియాకు అండగా నిలిచిన నన్నపునేని నరేందర్.. సంబంధిత పోలీసు అధికారులు వెంటనే స్పందించి, నిర్బంధంలో ఉన్న కార్యకర్తను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యకర్తలకు ఎలాంటి ఇబ్బంది వచ్చినా తాను అండగా ఉంటానని ఆయన స్పష్టం చేశారు. అక్రమ కేసులకు భయపడేది లేదని, కార్యకర్తల హక్కుల కోసం అవసరమైన స్థాయిలో పోరాడుతామని నన్నపునేని నరేందర్ పేర్కొన్నారు.

వివేకానంద పాఠశాలలో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

- శ్రీకృష్ణుడి బాల్య ఘట్టాలు, బోధించిన విలువలను వివరించిన మాతాజీ పూర్వజానంద



నిజామాబాద్ జిల్లా/కోటగిరి, సెప్టెంబర్ 04 (నిత్యం నిఘా ప్రతినిధి): కోటగిరి శ్రీ రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో వివేకానంద పాఠశాలలో శుక్రవారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేసి చిన్నారుల్లో భక్తిభావం, ఆధ్యాత్మిక చైతన్యం పెంపొందించేలా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉత్తర కాశీ నుంచి విచ్చేసిన మాతాజీ పూర్వజానంద ముఖ్యఅతిథిగా హాజరై చిన్నారులను ఉద్దేశించి మాట్లాడారు. శ్రీకృష్ణుడి బాల్య ఘట్టాలు, ఆయన బోధించిన విలువలు, ధర్మ సందేశాలను వివరించారు. చిన్నారులు శ్రీకృష్ణుడి బోధనలను ఆదర్శంగా తీసుకుని నైతిక విలువలతో ముందుకు సాగాలని సూచించారు. జన్మాష్టమి సందర్భంగా విద్యార్థులు శ్రీకృష్ణుడు, రాధాదేవి తదితరుల వేషధారణలో పాల్గొని అలరించారు. చిన్నారుల ప్రత్యేక వేషధారణలు, ప్రదర్శనలు కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో శ్రీ రామకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు గోగినేని శివ శ్రీనివాస్, రజిని, నాగశ్రీ, నితిన్ చంద్రతో పాటు పాఠశాల అధ్యాపక బృందం పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారులకు శ్రీకృష్ణ జన్మాష్టమి పండుగ ప్రాధాన్యతను వివరించి, పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

హన్మకొండలో ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

- రామ్‌నగర్ నుంచి వైభవంగా శ్రీకృష్ణుడి శోభాయాత్ర.. ఆకట్టుకున్న జానపద కళారూపాలు



హన్మకొండ, సెప్టెంబర్ 4 (నిత్యం నిఘా ప్రతినిధి): శ్రీకృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని హన్మకొండ నగరం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. రామ్‌నగర్ ప్రాంతంలో యాదవ సంఘాల ఆధ్వర్యంలో శ్రీకృష్ణుడి రథయాత్రను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన రథంపై బాలకృష్ణుడి విగ్రహాన్ని ఉంచి భక్తిశ్రద్ధలతో శోభాయాత్రను ప్రారంభించారు.

*** ఆకట్టుకున్న జానపద కళారూపాలు**

శోభాయాత్రలో డోలు వాయిద్యాలు, ఒగ్గు కళాకారుల విన్యాసాలు, స్థానిక జానపద కళాకారుల నృత్య ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యుత్ దీపాలు, రంగురంగుల పూలమాలలతో అలంకరించిన రథం రామ్‌నగర్ వీధుల్లో ముందుకు సాగింది. భక్తులు అడుగడుగునా మంగళహారతులు ఇస్తూ, 'జై శ్రీకృష్ణ' నామస్మరణలతో స్వాగతం పలికారు.

*** వేలాదిగా తరలివచ్చిన భక్తులు**

శోభాయాత్రలో యాదవ సంఘాల నాయకులు, యువత, మహిళలు, చిన్నారులు, పెద్ద సంఖ్యలో భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో అలరించారు. రామ్‌నగర్ వీధులను తోరణాలు, జెండాలతో అలంకరించడంతో పండుగ వాతావరణం నెలకొంది. శోభాయాత్ర ముగిసిన అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. వేడుకలు భక్తిశ్రద్ధలతో ప్రశాంతంగా ముగిశాయి.

కాంగ్రెస్ మోసపూరిత హామీలతో ప్రజలకు గోస

- దాస్యం వినయ్ భాస్కర్

- పెన్షన్లు పెంచుతామని హామీ ఇచ్చి విస్మరించారు
- హన్మకొండలో బీఆర్ఎస్ 'వంటావార్పు' నిరసన



హన్మకొండ, సెప్టెంబర్ 04 (నిత్యం నిఘా ప్రతినిధి) : ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నమ్మి ప్రజలు తీవ్రంగా మోసపోయి ఇబ్బందులు పడుతున్నారని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం హన్మకొండ చౌరస్తాలో 'వంటావార్పు' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు వృద్ధులు, వికలాంగుల పెన్షన్లను భారీగా పెంచుతామని హామీలు ఇచ్చి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని అన్నారు. అయితే ప్రభుత్వం ఏర్పడి ఇంతకాలమైనా పెన్షన్లను పెంచకుండా ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు. కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలోని ఏ వర్గం కూడా పూర్తిస్థాయిలో సంతోషంగా లేదని ఆయన అన్నారు. రైతులకు భరోసా లేకుండా పోయిందని, సంక్షేమ పథకాలు సక్రమంగా అందక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ పార్టీ క్షేత్రస్థాయిలో పోరాటాలను మరింత ఉధృతం చేస్తుందని దాస్యం వినయ్ భాస్కర్ తెలిపారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లో ఎండగడుతూ నిరంతరం పోరాడుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

Nityam Nigha 05.09.26_Layout 1 9/5/2026 6:14 AM Page 6

మంథని పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడిని సత్కరించిన మంత్రి శ్రీధర్‌బాబు

- క్రైస్తవ సమాజ అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తా: మంత్రి



పెద్దపల్లి జిల్లా/మంథని, సెప్టెంబర్04 (నిత్యం నిఘా ప్రతినిధి): మంథని డివిజన్ పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడిగా ఎన్నికైన పాస్టర్ జె. శ్రీనివాస్ పాల్ శుక్రవారం హైదరాబాద్‌లో రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు పాస్టర్ జె. శ్రీనివాస్ పాల్‌ను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. మంథని డివిజన్ పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడిగా ఎన్నికైనందుకు శుభాకాంక్షలు తెలియజేశారు. క్రైస్తవ సమాజ సంక్షేమం, అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. క్రైస్తవులకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని పేర్కొన్నారు.ఈ సందర్భంగా పాస్టర్ జె. శ్రీనివాస్ పాల్ మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి మంథని డివిజన్ పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. క్రైస్తవ సమాజ సంక్షేమం, అభివృద్ధి కోసం తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.

అన్ని రంగాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

- 420 హామీలతో ప్రజలను మోసం చేసింది.. మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి



భూపాలపల్లి జిల్లా/చిట్యాల, సెప్టెంబర్04 (నిత్యం నిఘా ప్రతినిధి) కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో అన్ని రంగాల్లో విఫలమైందని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి విమర్శించారు. శుక్రవారం చిట్యాల మండల కేంద్రంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అల్లం రవీందర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనకు నిరసనగా వంటావార్పు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గండ్ర వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో 420 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని పూర్తిస్థాయిలో అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. అమలు సాధ్యం కాని హామీలతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తిచేసుకున్నప్పటికీ ప్రజలకు ఇచ్చిన హామీల్లో ఒక్కటంటే ఒక్కటి కూడా సక్రమంగా అమలు చేయలేదని ఆయన ఆరోపించారు. ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని పేర్కొన్నారు. చిట్యాల మండల కేంద్రంలో నిర్వహించిన వంటావార్పు కార్యక్రమానికి రైతులు, మహిళలు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమంలో చిట్యాల మండల సర్పంచ్ తౌటం లక్ష్మీఅంతయ్య, మాజీ జడ్పీటీసీ గొర్రె సాగర్, బీఆర్ఎస్ మండల యువజన అధ్యక్షుడు తౌటం నవీన్, నాయకులు క్రాంతికుమార్‌రెడ్డి, రెడ్డి మల్లారెడ్డి, సాధ మల్లయ్యతో పాటు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

సంస్కృతీ సంప్రదాయాలను రాబోయే తరాలకు అందించాలి


- పార్టీలకు అతీతంగా పండుగలు జరుపుకోవడం అభినందనీయం: ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి



హనుమకొండ,సెప్టెంబర్ 04 (నిత్యం నిఘా ప్రతినిధి): సంస్కృతీ సంప్రదాయాలను పరిరక్షిస్తూ వాటిని రాబోయే తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. యువత సంప్రదాయాలను కొనసాగిస్తూ సమాజంలో ఐక్యతను పెంపొందించేలా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. 61వ డివిజన్ నవయూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలకు ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు, స్థానికులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే భక్తులకు శుభాకాంక్షలు తెలిపారు. పార్టీలకు అతీతంగా ప్రజలంతా కలిసి పండుగలను జరుపుకోవడం సంతోషకరమైన విషయమని అన్నారు. ఇలాంటి ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజల్లో ఐక్యతా భావాన్ని మరింత పెంపొందిస్తాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

కల్లూరులో ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

- రాధాకృష్ణుల వేషధారణలో అలరించిన చిన్నారులు.. ఉట్టి కొట్టే కార్యక్రమానికి విశేష స్పందన



నిజామాబాద్ జిల్లా / పోతంగల్, సెప్టెంబర్04 (నిత్యం నిఘా ప్రతినిధి) : పోతంగల్ మండలంలోని కల్లూరు గ్రామంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు శ్రీరామ గణేష్ మండలి ఆధ్వర్యంలో శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. పండుగ సందర్భంగా గ్రామంలో భక్తిశ్రద్ధలు, ఆధ్యాత్మిక ఉత్సాహం వెల్లివిరిసింది.ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో చిన్నారులు రాధాకృష్ణుల వేషధారణలో సందడి చేశారు. చిన్నారి కృష్ణులు, రాధల ముద్దులొలికే అభినయాలు గ్రామస్థులను విశేషంగా ఆకట్టుకున్నాయి.అనంతరం నిర్వహించిన సాంప్రదాయ ఉట్టి కొట్టే కార్యక్రమం వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పిల్లలు, యువకులు ఉత్సాహంగా పాల్గొని ఉట్టి కొట్టేందుకు పోటీపడటంతో గ్రామంలో పండుగ సందడి నెలకొంది.ఈ కార్యక్రమంలో శ్రీరామ గణేష్ మండలి సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీకృష్ణాష్టమి వేడుకలను విజయవంతం చేశారు.

శ్రీకృష్ణుడిగా భద్రకాళీ అమ్మవారి అలంకరణ

- శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా ఘనంగా ప్రత్యేక పూజలు.. 21 రకాల భోగాల నివేదన





వరంగల్,సెప్టెంబర్ 04 (నిత్యం నిఘా ప్రతినిధి): శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని వరంగల్ మహానగరంలోని శ్రీ భద్రకాళీ దేవస్థానంలో శుక్రవారం శ్రీకృష్ణ జన్మాష్టమి వ్రతాన్ని శాస్త్రోక్తంగా, అత్యంత వైభవంగా నిర్వహించారు. లోకకళ్యాణం, సకలజనుల శ్రేయస్సును కాంక్షిస్తూ ప్రతి ఏడాది నిర్వహించే సంప్రదాయంలో భాగంగా ఈసారి కూడా ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. ఉదయం నుంచే ఆలయంలో భక్తులు ఉపవాస దీక్షకు సంకల్పం చేసి శ్రీకృష్ణ నామస్మరణతో పూజా కార్యక్రమాలను తిలకించారు. తెల్లవారుజామున 4 గంటలకు అమ్మవారికి నిత్యాహ్నిక కార్యక్రమాలు యథావిధిగా నిర్వహించి, కృష్ణ జన్మాష్టమి వ్రతాచరణకు అమ్మవారి అనుజ్ఞ తీసుకుని వ్రతాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విష్ణు పంచాయతనాన్ని నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు పూజలు పూర్తయిన అనంతరం భద్రకాళీ అమ్మవారిని శ్రీకృష్ణుడి రూపంలో ప్రత్యేకంగా అలంకరించారు. అలంకరణకు సుమారు గంట సమయం పట్టింది. అనంతరం రాత్రి 8.30 గంటలకు శ్రీకృష్ణ రూపంలో ఉన్న అమ్మవారికి విశేష పూజలు నిర్వహించి 21 రకాల భోగాలను నైవేద్యంగా సమర్పించారు. పూజల అనంతరం భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు.

*** ప్రముఖుల ప్రత్యేక దర్శనం**

శుక్రవారం కావడంతో ఉదయం నుంచే శ్రీ భద్రకాళీ అమ్మవారి దర్శనం కోసం భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి–నీలిమ దంపతులు, వరంగల్ పోలీస్ కమిషనర్ శ్వేత ఐపీఎస్ తదితర ప్రముఖులు అమ్మవారిని దర్శించుకున్నారు. పూజల అనంతరం ప్రముఖులకు మహదాశీర్వచనం నిర్వహించి, అమ్మవారి శేషవస్త్రాలను బహూకరించారు. అనంతరం ప్రసాదాలను అందజేశారు.ఈ కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వాహణాధికారి రామల సునీత ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది, అర్చకులు, భక్తులు నిర్వహించారు.

కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనలో అభివృద్ధి శూన్యం

- **హామీల అమలుపై నిర్లక్ష్యం.. అవినీతి, అక్రమాలే రాజ్యమేలుతున్నాయి**
- **ఏటూరునాగారంలో మహిళల భారీ ర్యాలీ.. వంటావార్పుతో నిరసన**
- **మంత్రి సీతక్కకు 10 ప్రశ్నలు సంధించిన బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనరసింహారావు**





ఏటూరునాగారం,సెప్టెంబర్ 04 (నిత్యం నిఘా ప్రతినిధి): తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అవినీతి, అక్రమాలు రాజ్యమేలుతున్నాయని బీఆర్ఎస్ ములుగు జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీ నరసింహారావు ఆరోపించారు. కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనలో అభివృద్ధి శూన్యమని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు ములుగు జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం ఏటూరునాగారంలో భారీ నిరసన చేపట్టారు. మండలంలోని వివిధ ప్రాంతాల నుంచి మహిళలు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఓడగూడెం నుంచి ప్రారంభమైన ర్యాలీ సుమారు మూడు కిలోమీటర్లు కొనసాగి బస్టాండ్ సమీపంలోని ధర్నా చౌక్‌కు చేరుకుంది. ధర్నా చౌక్ వద్ద ప్రధాన రహదారిపై వంటావార్పు నిర్వహించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా లక్ష్మీనరసింహారావు మాట్లాడుతూ.. మహిళల సంక్షేమమే ధ్యేయమని చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు చేసిన మేలు ఏమిటో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ఎందుకు అమలు చేయడం లేదో ప్రభుత్వం సమాధానం చెప్పాలని అన్నారు.

*** హామీల లెక్క చెప్పకుండా ర్యాలీలెందుకు?**

కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలు, 420 హామీలు, వివిధ డిక్లరేషన్ల పేరుతో ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చిందని లక్ష్మీనరసింహారావు ఆరోపించారు. అధికారంలోకి వచ్చి నెలలు గడుస్తున్నా హామీల్లో ఏ ఒక్కదానినీ పూర్తిస్థాయిలో అమలు చేయలేదన్నారు. ప్రజలకు హామీల అమలు లెక్క చెప్పాల్సిన ప్రభుత్వం గత ప్రభుత్వాన్ని విమర్శించడానికే, ర్యాలీలు నిర్వహించడానికే పరిమితమైందని విమర్శించారు.

*** మంత్రి సీతక్కకు 10 ప్రశ్నలు**

ఏటూరునాగారం ప్రజలకు ఇచ్చిన హామీలపై మంత్రి సీతక్క సమాధానం చెప్పాలని లక్ష్మీనరసింహారావు డిమాండ్ చేశారు. ఏటూరునాగారాన్ని రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. నూతన బస్టాండ్, ఆర్టీసీ డిపో నిర్మాణానికి శంకుస్థాపన ఎప్పుడు చేస్తారని నిలదీశారు. గోదావరి వరదల నుంచి ప్రజలను రక్షించేందుకు కరకట్ట నిర్మాణం ఎప్పుడు చేపడతారని ప్రశ్నించారు. ప్రతి ఏటా అంచనాలు మార్చడం తప్ప కరకట్ట నిర్మాణంపై ప్రభుత్వం తీసుకున్న చర్యలేంటని నిలదీశారు. రైతులకు గిట్టుబాటు ధర, రైతుబంధు, రైతుబీమా, రుణమాఫీ పరిస్థితి ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. మంగపేట మండలం కమలాపూర్ ఫ్యాక్టరీని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తెరిపిస్తామని పోరాడిన సీతక్క.. అధికారంలోకి వచ్చి ఇంతకాలమైనా దానిని ఎందుకు ప్రారంభించలేదని ప్రశ్నించారు. స్థానిక గిరిజన యువతకు ఉపాధి ఎప్పుడు కల్పిస్తారో చెప్పాలని అన్నారు. రూ.500 గ్యాస్ పథకం ద్వారా ఎంతమంది మహిళలకు లబ్ధి చేకూరిందో వివరించాలని, లబ్ధిదారుల జాబితాను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. పోడు భూముల సమస్యకు శాశ్వత పరిష్కారం ఎప్పుడు చూపిస్తారని ప్రశ్నించారు. గిరిజన మంత్రిగా ఉండి ఐటీడీఏను బలోపేతం చేయకుండా ఎందుకు నిర్వీర్యం చేస్తున్నారని నిలదీశారు. పెన్షన్లు, కళ్యాణలక్ష్మి , షాదీముబారక్ వంటి పథకాల అమలుపైనా ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. 33 నెలల పాలన తర్వాత కూడా ప్రతి సమస్యకు గత ప్రభుత్వాన్నే కారణంగా చూపడం సరికాదని అన్నారు.

*** ములుగులో 'జనతా గ్యారేజ్' ఉంది**

ములుగు నియోజకవర్గంలో దొరలు, గడీల పాలన ఉందని విమర్శించడం సరికాదని లక్ష్మీనరసింహారావు అన్నారు. తమది 'జనతా గ్యారేజ్' అని, బడుగు, బలహీన వర్గాలతో పాటు పార్టీలకు అతీతంగా ప్రజా సమస్యలపై పోరాడుతామని స్పష్టం చేశారు. ప్రజల సమస్యలను నిర్లక్ష్యం చేసే రాజకీయాలకు రాబోయే రోజుల్లో ప్రజలే తగిన సమాధానం చెబుతారని అన్నారు.

*** ఫ్లెక్సీలు, బ్యానర్లు తొలగించడం సిగ్గుచేటు**

ఏటూరునాగారంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, బ్యానర్లను పోలీసులు, కాంగ్రెస్ నాయకులు కలిసి తొలగించడం సిగ్గుచేటని లక్ష్మీనరసింహారావు ఆరోపించారు. ఎన్ని అడ్డంకులు, కుట్రలు ఎదురైనా ప్రజా సమస్యలపై తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. అనంతరం వంటావార్పు కార్యక్రమంలో పాల్గొని మహిళలు, కార్యకర్తలకు భోజనం వడ్డించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ ములుగు నియోజకవర్గ ఇన్‌చార్జి బడే నాగజ్యోతి, పోరిక గోవింద్ నాయక్, తాటి కృష్ణ, భూక్య జంపన్న, గడదాసు సునీల్‌కుమార్, కాకులమర్రి శ్రీలత, ఖాజా పాషా, ఎం.డి. సర్దార్ పాషా, కాకులమర్రి ప్రదీప్‌రావు, తుమ్మ మల్లారెడ్డి, కాక వెంకటేశ్వర్లు, అంతటి విజయనాగరాజు, తూరం పద్మ, ఈసం స్వరూప, పోరిక సరితా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, ప్రజలు హాజరయ్యారు.

Nityam Nigha 05.09.26_Layout 1 9/5/2026 6:14 AM Page 7

టేకులగూడెం ఇసుక దందాలో వాటాల గొడవ.. హత్యాయత్నం వరకు!

- గిరిజనుల ముసుగులో లక్షల దోపిడీ ఆరోపణలు.. చక్రపాణి, విక్రమ్‌రెడ్డి మధ్య కమిషన్ పంచాయితీ?





ములుగు జిల / వాజేడు, సెప్టెంబర్ 04 (నిత్యం నిఘా ప్రతినిధి): ములుగు జిల్లా వాజేడు మండలం టేకులగూడెం గ్రామంలోని గిరిజన ఇసుక సొసైటీ క్వారీలో వాటాల పంపకాల వ్యవహారం వివాదానికి దారితీసి, చివరకు హత్యాయత్నం ఆరోపణల వరకు వెళ్లినట్లు స్థానికంగా చర్చ జరుగుతోంది. గిరిజనుల పేరుతో ఇసుక దందా సాగిందని, కమిషన్ పంపకాల్లో తేడాలు రావడంతోనే కాంట్రాక్టర్ల మధ్య విభేదాలు తలెత్తాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. టేకులగూడెం క్వారీకి సంబంధించి రేజింగ్ కాంట్రాక్టర్లు చక్రపాణి, విక్రమ్‌రెడ్డి మధ్య కమిషన్ విషయంలో విభేదాలు తలెత్తినట్లు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు చెబుతున్నారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ నాయకుడు చక్రపాణి తనపై వరుసగా దాడులు జరుగుతున్నాయని ఆరోపిస్తున్నారు. తాను బీఆర్ఎస్‌లో కొనసాగుతున్నందుకే కాంగ్రెస్ నాయకులు తన క్వారీలను ఆక్రమించేందుకు టార్గెట్ చేస్తున్నారని ఆయన ఆరోపించారు. తాడ్వాయి మండలం కొండపర్తి స్టేజి వద్ద తన కారుపై దాడి జరిగిందని, దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ స్పందించలేదని చక్రపాణి తెలిపారు. తనకు ప్రాణహాని ఉందని మంగళవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి రక్షణ కోరిన 24 గంటల్లోనే మరో ఘటన చోటుచేసుకుందని ఆయన పేర్కొన్నారు. బుధవారం రాత్రి మల్లంపల్లి మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై తన బైక్‌ను గుర్తుతెలియని కారు ఢీకొట్టి వెళ్లిపోయిందని, ఇది పక్కా హత్యాయత్నమేనని ఆరోపించారు. ఈ ఘటనలో గాయపడిన ఆయన ములుగులో చికిత్స పొందినట్లు తెలిపారు.

*** భారీ యంత్రాలతో ఇసుక తవ్వకాల ఆరోపణలు** ... టేకులగూడెం ప్రాంతంలో గిరిజనులకు మాయమాటలు చెప్పి, అధికారులను మచ్చిక చేసుకుని భారీ యంత్రాలతో గోదావరి గర్భాన్ని తవ్వి ఇసుకను తరలించారని స్థానికులు ఆరోపిస్తున్నారు. టిప్పర్లలో తరలించిన ఇసుకను రోడ్డు పక్కనే నిల్వ చేసి, జాతీయ రహదారి–163పైనే లారీలకు లోడింగ్ చేయడంతోరహదారి దెబ్బతి నడంతో పాటు భారీగాదుమ్ము, ధూళి ఏర్పడుతోందని వాహనదారులు వాపోతున్నారు. ఇసుక లారీల డ్రైవర్ల వద్ద లోడింగ్ పేరుతో డబ్బులు వసూలు చేసి లక్షల రూపాయలు దండుకున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణలపై సంబంధిత కాంట్రాక్టర్లు, అధికారులు స్పష్టత ఇవ్వాల్సి ఉంది. ఇసుక క్వారీలు తిరిగి ప్రారంభమయ్యే నేపథ్యంలో జాతీయ రహదారి–163పై ఇసుక లారీలను నిలిపివేయకుండా, ట్రాఫిక్ అంతరాయం కలగకుండా అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కోరుతున్నారు. అలాగే హత్యాయత్నం ఆరోపణలపై పోలీసులు సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని డిమాండ్ చేస్తున్నారు.

ఏటూరునాగారంలో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

- నృత్యాలతో అలరించిన నార్త్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థినులు



ఏటూరునాగారం, సెప్టెంబర్04 (నిత్యం నిఘా ప్రతినిధి) :



ఏటూరునాగారం మండల కేంద్రంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో శుక్రవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఇస్కాన్ ప్రభుదాస్, రవితేజ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో స్వామివారి ఉత్సవ విగ్రహాలకు పంచామృత అభిషేకం, పుష్పాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణుడు భారతీయ సంస్కృతి, సంప్రదాయాల్లో పోషించిన పాత్రను భక్తులకు వివరించారు. గ్రామం నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు. కాగా, నార్త్ ప్రభుత్వ పాఠశాలకు చెందిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకున్నారు. విద్యార్థులు కృష్ణుడు, రాధా వేషధారణలో ఆకట్టుకోగా, భక్తి గీతాలకు నృత్యాలు ప్రదర్శించారు. విద్యార్థుల నృత్యాలతో ఆలయ ప్రాంగణం కరతాళ ధ్వనులతో మార్మోగింది. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరు కావడంతో ఆలయ ప్రాంగణంలో పండుగ సందడి నెలకొంది. భక్తిశ్రద్ధలతో నిర్వహించిన కృష్ణాష్టమి వేడుకలు ఆకట్టుకున్నాయి.

హడుకొకలిని అంగన్‌వాడీ కేంద్రంలో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

- కృష్ణుడు, రాధా వేషధారణలో సందడి చేసిన చిన్నారులు





నిజామాబాద్ జిల్లా/పోతంగల్, సెప్టెంబర్04 (నిత్యం నిఘా ప్రతినిధి): పోతంగల్ మండల కేంద్రంలోని హడుకొకలిని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు శ్రీకృష్ణుడు, రాధా వేషధారణలో సందడి చేస్తూ వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.అంగన్‌వాడీ సిబ్బంది చిన్నారులకు కృష్ణాష్టమి పండుగ విశిష్టతను వివరించారు. అనంతరం కృష్ణుడి జీవితానికి సంబంధించిన పాటలు, ఆటలు నిర్వహించి చిన్నారుల్లో ఉత్సాహాన్ని నింపారు. కృష్ణుడు, రాధా వేషధారణలో చిన్నారుల చిలిపి చేష్టలు తల్లిదండ్రులు, అంగన్‌వాడీ సిబ్బందిని ఆకట్టుకున్నాయి.ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్ జయశ్రీ మాట్లాడుతూ.. చిన్నారుల్లో భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, పండుగల ప్రాధాన్యతపై అవగాహన కల్పించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ ఆయమ్మ హైమద్ బేగం, బీసీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రం టీచర్ జ్యోతి, ఆయమ్మ నిర్మలతో పాటు చిన్నారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ వెయ్యి రోజుల విఫల పాలనపై బీఆర్ఎస్ వంటావార్పు

- ఆరు గ్యారెంటీల అమలులో వైఫల్యాన్ని ఎండగట్టిన బీఆర్ఎస్ నాయకులు

హనుమకొండ/మడికొండ, సెప్టెంబర్04 (నిత్యం నిఘా ప్రతినిధి): కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం మడికొండ మెయిన్ రోడ్ చౌరస్తాలో వంటావార్పు కార్యక్రమం నిర్వహించారు. వర్ధన్నపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ ఆదేశాల మేరకు 64వ డివిజన్ బీఆర్ఎస్ కార్పొరేటర్ ఆవాల రాధికరెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీల అమలులో వైఫల్యాన్ని నిరసిస్తూ నిర్వహించిన కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వృద్ధులు, దివ్యాంగులు, మహిళలు సైతం కార్యక్రమానికి హాజరై తమ నిరసన తెలిపారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై బీఆర్ఎస్ నాయకులు విమర్శలు చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు.



గద్దర్ విగ్రహానికి స్థలం కేటాయించండి

- ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డికి ప్రజా సంఘాల నాయకుల వినతి

హనుమకొండ, సెప్టెంబర్04 (నిత్యం నిఘా ప్రతినిధి):): ప్రజాయుద్ధనౌక గద్దర్ విగ్రహాన్ని హనుమకొండ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసేందుకు స్థలం కేటాయించాలని కోరుతూ ప్రజా సంఘాల నాయకులు శుక్రవారం వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. హనుమకొండ జిల్లా కలెక్టర్‌కు ప్రజా సంఘాల నాయకులు గతంలో అందజేసిన వినతిపత్రాన్ని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి వెంటనే కలెక్టర్‌కు ఫార్వర్డ్ చేసినందుకు నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో గద్దర్ కీలక పాత్ర పోషించారని వారు పేర్కొన్నారు.గద్దర్ ఆశయాలను కొనసాగించడంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఆయన విగ్రహాలను ఏర్పాటు చేసి, పీడిత ప్రజల హక్కుల కోసం ఉద్యమ స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లాలని ప్రజా సంఘాల నాయకులు కోరారు. హనుమకొండలో గద్దర్ విగ్రహ ఏర్పాటుకు అనువైన స్థలం కేటాయించి సహకరించాలని ఎమ్మెల్యేను విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో గద్దర్ విగ్రహ స్థాపన కమిటీ చైర్మన్ కోండ్ర నర్సింగరావు, బీసీ జాక్ నాయకుడు డాక్టర్ తిరునహరి శేషు, వీసీకే పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జిలుకర శ్రీనివాస్, ఆల్ ఇండియా ఓబీసీ జాక్ చైర్మన్ సాయిని నరేందర్, డీబీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చుంచు రాజేందర్, గజాల గోవర్ధన్, గద్దర్ సాంబయ్య, పి. రమేష్ తదితరులు పాల్గొన్నారు.



హరిత సాంకేతికతలతోనే ఎంఎస్ఎంఈలకు లాభాలు

- **ఇంధన పొదుపు, సౌర విద్యుత్‌తో పోటీతత్వం పెంపు**
- **ఆర్ఐసీహెచ్ ప్రాజెక్ట్ మేనేజర్ చరణ్**





ములుగు, సెప్టెంబర్04 (నిత్యం నిఘా ప్రతినిధి):హరిత సాంకేతికతలను స్వీకరించడం ద్వారా సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈలు) ఉత్పత్తి వ్యయాలను తగ్గించుకోవడంతో పాటు ప్రపంచ మార్కెట్లలో పోటీతత్వాన్ని పెంచుకోవచ్చని ఆర్ఐసీహెచ్ ప్రాజెక్ట్ మేనేజర్–సస్టైనబిలిటీ చరణ్ ఉప్పరపల్లి అన్నారు. ములుగు రైస్ మిల్ అసోసియేషన్ సహకారంతో ఆర్ఐసీహెచ్ ఆధ్వర్యంలో ర్యాంప్–గ్రీనింగ్ ఆఫ్ ఎంఎస్ఎంఈ కార్యక్రమంపై అవగాహన సదస్సును గురువారం ములుగులో నిర్వహించారు. ఈ సందర్భంగా చరణ్ మాట్లాడుతూ.. పరిశ్రమలు ఇంధన సామర్థ్యం, వనరుల పొదుపు, సౌర విద్యుత్ వంటి హరిత సాంకేతికతలను వినియోగించుకోవాలని సూచించారు. ‘గోయింగ్ గ్రీన్’ అనేది కేవలం పర్యావరణ పరిరక్షణకే పరిమితం కాదని, వ్యాపార స్థిరత్వం, భవిష్యత్ పోటీతత్వానికి కూడా కీలకమని ఆయన పేర్కొన్నారు.ములుగు రైస్ మిల్ అసోసియేషన్ అధ్యక్షుడు బాదం ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. పరిశ్రమలు ఇంధన సామర్థ్య చర్యలను పాటించడంతో పాటు సౌర విద్యుత్, ఇతర హరిత సాంకేతికతలను స్వీకరించాలని సూచించారు. తద్వారా నిర్వహణ వ్యయాలను తగ్గించుకుని స్థిరమైన అభివృద్ధిని సాధించవచ్చని తెలిపారు.ములుగు డీఐసీ జనరల్ మేనేజర్ ఏ. సిద్ధార్థరెడ్డి మాట్లాడుతూ.. ఎంఎస్ఎంఈలు ర్యాంప్–గ్రీనింగ్ ఆఫ్ ఎంఎస్ఎంఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని ఇంధన వినియోగాన్ని తగ్గించడంతో పాటు స్థిరమైన సాంకేతికతలను అవలంబించాలని సూచించారు.కార్యక్రమంలో రైస్ మిల్ పరిశ్రమల ప్రతినిధులు, ఎంఎస్ఎంఈ పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

Nityam Nigha 05.09.26_Layout 1 9/5/2026 6:14 AM Page 8

కృష్ణాష్టమి పుణ్యతిథిన శ్రీ మహాలక్ష్మి పవళింపు సేవ

- శ్రావణ శుక్రవారం భక్తులతో పోటెత్తిన ఆలయం.. పవళింపు సేవలో పాల్గొన్న మహిళలు





పెద్దపల్లి జిల్లా/మంథని, సెప్టెంబర్04 (నిత్యం నిఘా ప్రతినిధి): శ్రావణ మాసంలో కృష్ణాష్టమి పుణ్యతిథి, శ్రావణ శుక్రవారం సందర్భంగా మంథని పట్టణంలోని శ్రీ మహాలక్షి ఆలయం శుక్రవారం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం 4 గంటల నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 4 గంటలకు శ్రీ మహాలక్షి అమ్మవారికి అభిషేకం నిర్వహించగా, ఉదయం 6 గంటలకు అర్చన అనంతరం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. సాయంత్రం మహిళా భక్తులు మధురమైన గాత్రంతో శ్రీ మహాలక్షి దేవి పవళింపు సేవను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని వ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు మారుపాక ప్రశాంత్ శర్మ మాట్లాడుతూ.. భక్తుల సౌకర్యార్థం ఆలయంలో అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. శ్రీ మహాలక్షి అమ్మవారి అనుగ్రహంతో భక్తులకు సకల సౌభాగ్యాలు, సంతోషాలు కలగాలని ఆకాంక్షించారు. శ్రావణ మాసంలో వరలక్ష్మీ వ్రతానికి విశిష్టమైన ప్రాధాన్యత ఉందని అర్చకులు వివరించారు. శ్రావణ శుక్రవారం రోజున అమ్మవారిని భక్తిశ్రద్ధలతో పూజించడం ద్వారా సౌభాగ్యం, ఐశ్వర్యం కలుగుతాయని భక్తుల విశ్వాసమని తెలిపారు.వరలక్ష్మీ వ్రతం ప్రాశస్త్యాన్ని స్కాంద పురాణంలో వివరించినట్లు పేర్కొన్నారు. శుచిత్వం, భక్తి, సదాచారం ఉన్న చోట లక్ష్మీదేవి అనుగ్రహం ఉంటుందని ఆధ్యాత్మిక గ్రంథాలు తెలియజేస్తున్నాయని తెలిపారు. భక్తులు పవిత్రమైన మనస్సుతో అమ్మవారిని ఆరాధించి ఆమె కృపకు పాత్రులు కావాలని సూచించారు.పవళింపు సేవ, ప్రత్యేక పూజల సందర్భంగా ఆలయంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించి అమ్మవారి ఆశీస్సులు పొందారు.

వర్ధన్నపేటలో మార్మోగిన శ్రీకృష్ణ నామస్మరణ

-భక్తిశ్రద్ధలతో జన్మాష్టమి వేడుకలు.. ప్రత్యేక పూజల్లో మున్సిపల్ చైర్మన్ సారంగపాణి

వరంగల్/వర్ధన్నపేట,సెప్టెంబర్ 04 (నిత్యం నిఘా ప్రతినిధి):వర్ధన్నపేట మున్సిపాలిటీ పరిధిలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహించారు. యాదవ సంఘం అధ్యక్షుడు, వార్డు కౌన్సిలర్ సిలువేరు కుమార స్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలకు మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి ముఖ్య అతిథిగా హాజరై శ్రీకృష్ణ పరమాత్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా చైర్మన్ సారంగపాణి మాట్లాడుతూ.. శ్రీకృష్ణ జన్మాష్టమి ధర్మం, న్యాయం, సత్యం, ప్రేమ, సోదరభావానికి ప్రతీక అని అన్నారు. భగవద్గీత ద్వారా శ్రీకృష్ణుడు మానవాళికి కర్తవ్య నిర్వహణ, ధర్మ మార్గంలో పయనించడం, నిష్కామ కర్మ వంటి గొప్ప సందేశాలను అందించారని తెలిపారు. యాదవ సంఘం ఆధ్వర్యంలో ప్రతి ఏటా సంప్రదాయబద్ధంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను నిర్వహించడం అభినందనీయమన్నారు. యాదవుల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.





*** వర్ధన్నపేట ఐక్యతకు పండుగలు నిదర్శనం**

పట్టణంలో కులమతాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలు ఐకమత్యంతో పండుగలను జరుపుకోవడం వర్ధన్నపేటలోని సోదరభావానికి నిదర్శనమని చైర్మన్ పేర్కొన్నారు. శ్రీకృష్ణుడి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఏసీపీ అంబటి నర్సయ్య, సీఐ సంజీవరావు, ఎస్ఐలు సాయిబాబు, రాజ్, మున్సిపల్ వైస్ చైర్మన్ నేతావత్ శిభారాణి–రాజేందర్, వార్డు కౌన్సిలర్ బెజ్జం పాపారావు, చిరువేలు రమ–రాజశేఖర్, నునవత్ కమిలి–కిమా నాయక్, యాదవ సంఘం నాయకులు బక్కతట్ల రాజ్ యాదవ్, మంచాల రమకృష్ణ, సిలువేరు శ్రీధర్, కందుగుల నర్సయ్య, చందు సాయిలు, చందు రవి, బక్కతట్ల వెంకట్‌తో పాటు ప్రజాప్రతినిధులు, యాదవ సంఘం సభ్యులు, భక్తులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల ముందస్తు అరెస్టులు అప్రజాస్వామికం

- నిరసనకు అనుమతించకుండా పోలీసులు అడ్డుకున్నారని
మండల బీజేపీ అధ్యక్షుడు రవికుమార్ ఆరోపణ




జనగామ జిల్లా/పాలకుర్తి, సెప్టెంబర్ 04 (నిత్యం నిఘా ప్రతినిధి): బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై కాంగ్రెస్ కార్యకర్తల దాడికి నిరసనగా చేపట్టాల్సిన కాంగ్రెస్ దిష్టిబొమ్మ దహన కార్యక్రమాన్ని పోలీసులు అడ్డుకున్నారని పాలకుర్తి మండల బీజేపీ నాయకులు ఆరోపించారు. మండల బీజేపీ అధ్యక్షుడు మారం రవికుమార్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించేందుకు సిద్ధమవగా.. పోలీసులు పలువురు బీజేపీ నాయకులను ముందస్తుగా అరెస్టు చేసి కార్యక్రమాన్ని అడ్డుకున్నారని తెలిపారు. ఈ సందర్భంగా మారం రవికుమార్ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపే హక్కు ప్రతి భారత పౌరుడికి ఉందని అన్నారు. నిరసన కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు బీజేపీ నాయకులను ముందస్తుగా అరెస్టు చేయడం అప్రజాస్వామిక చర్య అని మండిపడ్డారు. ప్రజల పక్షాన శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును పోలీసులు హరించడం హేయమైన చర్య అని విమర్శించారు. పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసిన వారిలో బీజేపీ నాయకులు కమ్మగాని శ్రీకాంత్‌గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి పెనుగొండ సోమేశ్వర్ తదితరులు ఉన్నారని తెలిపారు.

పాస్‌పోర్ట్ పోయిందని పోలీసులకు ఫిర్యాదు

- నెల రోజులుగా వెతికినా దొరకకపోవడంతో పోలీసులను ఆశ్రయించిన వ్యక్తి

ఎల్కతుర్తి, సెప్టెంబర్04 (నిత్యం నిఘా ప్రతినిధి):ఎల్కతుర్తి గ్రామానికి చెందిన గూడెల్లి నవీన్‌కుమార్ (35) తన పాస్‌పోర్ట్ పోయిందని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పాస్‌పోర్ట్ పోయి నెల రోజులు కావడంతో ఎక్కడ వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులను ఆశ్రయించినట్లు తెలిపారు. నవీన్‌కుమార్ నెల రోజుల క్రితం నిత్యావసర వస్తువులు కొనుగోలు చేసేందు కు ఎల్కతుర్తి మండల కేంద్రానికి వచ్చారు. వస్తువులు కొనుగోలు చేసిన అనంతరం ఇంటికి తిరిగి వెళ్తున్న సమయం లో తన ఎడమవైపు జేబులో పాస్‌పోర్ట్‌ను (నంబర్: R3138851) భద్ర పరుచుకున్నారు. ఇంటి కి చేరుకున్న తర్వాత చూసుకోగా పాస్‌పోర్ట్ జేబులో కని పించలేదు.దీంతో తాను వచ్చిన మార్గంలో తిరిగి వెళ్లి వెతికినా పాస్‌పోర్ట్ ఆచూకీ లభిం చలేదు. అప్పటి నుంచి నెల రోజులుగా పాస్‌పోర్ట్ కోసం వెతికినప్పటికీ ఫలితం లేక పోవడంతో చివరకు పోలీసులను ఆశ్రయిం చారు. పోయిన పాస్‌పోర్ట్‌ను గుర్తించి, ఆచూకీ కనుగొని తగిన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.



భద్రాద్రిలో అంబరాన్నంటిన కృష్ణలీలలు

- శ్రీకృష్ణ ఆలయంలో నేత్రపర్వంగా ఉట్ల పండుగ - భక్తులతో మార్మోగిన రామాలయం వీధి



భద్రాచలం, సెప్టెంబర్ 4 (నిత్యం నిఘా ప్రతినిధి):
దక్షిణ అయోధ్యగా ఖ్యాతిగాంచిన భద్రాచల పుణ్యక్షేత్రంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు అత్యంత వైభవంగా, ఆధ్యాత్మిక శోభతో నిర్వహించారు. రామాలయం వీధిలోని శ్రీకృష్ణ దేవాలయంలో జరిగిన వార్షిక ఉట్ల పండుగ భక్తుల హర్షధ్వానాలు, కృష్ణ నామస్మరణల మధ్య కన్నులపండువగా సాగింది. గోకుల కృష్ణుడి లీలలను తలపించేలా నిర్వహించిన ఈ వేడుకల్లో భక్తులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఉదయం నుంచే శ్రీకృష్ణ ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. బాలగోపాలుడిని సుగంధ పుష్పాలు, విశేష ఆభరణాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఆలయ అర్చకులు వేద మంత్రోచ్ఛారణల మధ్య స్వామివారికి విశేష అర్చనలు నిర్వహించి, నవనీతం, పాలు, వెన్నతో పాటు వివిధ రకాల తీపి పిండివంటలను నైవేద్యంగా సమర్పించారు. భక్తుల భజనలు, సంకీర్తనలతో రామాలయం వీధి ఆధ్యాత్మిక సందడితో మార్మోగింది.

ఉట్టి కొట్టే సంబరంతో సందడి ....
వేడుకల్లో ప్రధాన ఆకర్షణగా నిలిచిన సంప్రదాయ 'ఉట్టి కొట్టే' కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. గ్రామ సర్పంచ్ పూనెం కృష్ణదొర, ఆలయ కమిటీ చైర్మన్ బొల్లి నాగేశ్వరరావు ఉట్టి తాళ్లను పైకి కిందకూ లాగుతుండగా.. స్థానిక యువకులు ఉట్టిని కొట్టేందుకు ఉత్సాహంగా పోటీపడ్డారు. రంగు నీళ్లు చల్లుకుంటూ, కేరింతలు కొడుతూ యువత ప్రదర్శించిన విన్యాసాలు చూపరులను ఆకట్టుకున్నాయి.'గోవిందా.. గోపాలా..' అంటూ భక్తులు చేసిన జయజయధ్వానాల మధ్య ఉట్టిని పగలగొట్టిన దృశ్యం వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది

సీతారాముల ఆలయంలోనూ ప్రత్యేక వేడుకలు
భద్రాచలం సీతారామచంద్రస్వామి వారి ప్రధాన ఆలయంలోనూ శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా ఉట్ల పండుగ వేడుకలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం దర్బారు సేవ అనంతరం శ్రీరామచంద్రస్వామివారిని కృష్ణావతారంలో ప్రత్యేకంగా అలంకరించారు. బాల కృష్ణుడి రూపంలో భక్తులకు దర్శనమిచ్చిన స్వామివారికి అర్చకులు శాస్త్రోక్తంగా లాలలు, జోలలు పాడుతూ ఉయ్యాల సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా పాలు, వెన్న, తీపి పిండి వంటలను స్వామివారికి ఆరగింపుగా నివేదించారు. వేడుకల్లో పాల్గొన్న భక్తులకు ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందజేశారు.

హామీల అమలుపై బీఆర్ఎస్ సమరశంఖం

- వంటావార్పుతో కాంగ్రెస్ ప్రభుత్వానికి సెగ.. మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్

వరంగల్/వర్ధన్నపేట, సెప్టెంబర్ 4 (నిత్యం నిఘా ప్రతినిధి):ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడం లేదని ఆరోపిస్తూ బీఆర్ఎస్ చేపట్టిన వారం రోజుల పోరు బాటలో భాగంగా శుక్రవారం వర్ధన్నపేట నియోజక వర్గ కేంద్రంలోని అంబేద్కర్ జంక్షన్ వద్ద వంటావార్పు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు.ఈ సందర్భంగా అరూరి రమేష్ మాట్లాడుతూ.. అధికారంలోకి రావడానికి సాధ్యం కాని హామీలను ఇచ్చి ప్రజలను కాంగ్రెస్ మభ్యపెట్టిందని ఆరోపించారు. ఎన్నికల సమయంలో మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయం, కళ్యాణలక్ష్మి తో పాటు తులం బంగారం, విద్యార్థినులకు స్కూటీలు ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఆ హామీల పరిస్థితి ఏమిటో ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.వృద్ధులకు రూ.4 వేల పింఛన్, వికలాంగులకు రూ.6 వేల పింఛన్ ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని ఎంతవరకు అమలు చేసిందో వెల్లడించాలని కోరారు. ప్రజల ఓట్లతో అధికారంలోకి వచ్చి.. అదే ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.

*** మాటలు కాదు.. హామీలు అమలు చేయాలి**
ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసే వరకు బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని అరూరి రమేష్ స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, రానున్న ఎన్నికల్లో తగిన సమాధానం చెప్పేలా ప్రజలను చైతన్యపరుస్తామని అన్నారు. ముఖ్యంగా మహిళలకు ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో మహిళలే కాంగ్రెస్ ప్రభుత్వానికి ఓటు ద్వారా గుణపాఠం చెబుతారని పేర్కొన్నారు. వంటావార్పు కార్యక్రమం ద్వారా తెలంగాణ ఉద్యమకాలం నాటి పోరాట స్ఫూర్తిని మరోసారి ప్రజల్లోకి తీసుకెళ్తున్నామని బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మాజీ ప్రజాప్రతినిధులు, మాజీ పార్టీ అధ్యక్షులు, నాయకులు, మహిళా నాయకురాళ్లు, కార్యకర్తలు, అభిమానులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





ముదిరాజ్ నేత కొమురయ్య మృతి.. ఘన నివాళులర్పించిన మార్నేని రవీందర్‌రావు

- ఐనవోలులో విషాదఛాయలు.. కుటుంబ సభ్యులను పరామర్శించిన మాజీ టెస్కాబ్ చైర్మన్

హనుమకొండ/ఐనవోలు, సెప్టెంబర్04 (నిత్యం నిఘా ప్రతినిధి): ఐనవోలు మండల కేంద్రానికి చెందిన ముదిరాజ్ సంఘం మాజీ అధ్యక్షుడు గందేపల్లి కొమురయ్య అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతి విషయం తెలుసుకున్న నందనం సొసైటీ చైర్మన్, మాజీ టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు కొమురయ్య మృతదేహం వద్దకు చేరుకుని పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం కొమురయ్య కుటుంబ సభ్యులను పరామర్శించిన మార్నేని రవీందర్‌రావు.. వారికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ముదిరాజ్ సంఘం అభ్యున్నతికి కొమురయ్య చేసిన సేవలను ఆయన ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. కొమురయ్య మృతి ముదిరాజ్ సమాజానికి తీరని లోటని పేర్కొన్నారు.కొమురయ్య మృతి వార్తతో ఐనవోలులో విషాదఛాయలు అలుముకున్నాయి. ఆయనను చివరిసారి చూసేందుకు బంధువులు, స్నేహితులు, సంఘ నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.మార్నేని రవీందర్‌రావు వెంట ఐనవోలు గ్రామ ఉపసర్పంచ్ బరిగల భాస్కర్, సునీల్, సంపత్‌రెడ్డి, ఉపేందర్, పైడి తదితర కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.



Printed, Published and Owned by Bura Nagesh Goud, on behalf of Amulya Publications & Printers Graphics, Editor - Bura Nagesh Goud, is responsible for news selection under PRB act prgi.gov.in RNI. TGTEL/25/A1665, # 5-11-1014/A, Naim Nagar, Hanamkonda, Warangal, Telangana, India - 506009, Cell : 9441974025, 9440170543 Email:nityamnigha.acs@gmail.com